Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 04.11.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 22 పేజీలు : 12, వెల : ₹ 5

ISO 9001-2008



Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి రాజకీయ సలహాదారులెవరోగాని, ఆయనకు చచ్చు సలహాలిస్తున్నట్లున్నారు. చూడబోతే చంద్రబాబు మనుషులే జగన్‌కు రాజకీయ సలహాదారులుగా ఉన్నట్లుంది. లేకపోతే అనాలోచిత నిర్ణయాలతో అనుకూలంగా మారుతున్న అవకాశాలను సైతం కాలదన్నుకుంటున్నాడు.

## ఎంపీల రాజీనామాలతో...
# ఎవరికి 'ఉప'యోగం

### ఇది సాధ్యమయ్యే పనేనా?

**2014** ఎన్నికల్లో వేసిన తప్పటడుగులే ఆయనను అధికారానికి దూరంగా పెట్టాయి. ఆ తప్పటడుగులకు ప్రధానకారణం అంతకుముందు ఏడాది క్రితం జరిగిన ఉపఎన్నికలే! కాంగ్రెస్ నుండి వైకాపాలో చేరిన ఎంపీలు, ఎమ్మెల్యేల చేత రాజీనామాలు చేయించి ఆయన ఉపఎన్నికలకు పోయాడు. ఆనాడు రాష్ట్రంలో వున్న రాజకీయ పరిస్థితులు వేరు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు విసుగెత్తారు. తెలుగుదేశం పార్టీ సంస్థాగతంగా చచ్చుబడిపోయి వుండింది. ఆ సమయంలో ప్రజల్లో వై.యస్. సానుభూతి ప్రబలంగా వుంది. జగన్ పట్ల క్రేజ్ విపరీతంగా వుండింది. కాబట్టే 17 అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగితే 15స్థానాల్లో వైకాపా అభ్యర్థులు భారీ మెజార్టీలతో గెలిచారు. రెండుచోట్ల మాత్రం కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఆరోజు భారీ మెజార్టీలతో గెలిచిన స్థానాలను చూసుకునే జగన్ ఇక అధికారం ఖాయమనుకునే కోణంలోకి వెళ్లాడు. కాని విజ్ఞులు ఇక్కడే ఆలోచిస్తారు. గెలిచిన 15స్థానాలను లెక్కలోకి తీసుకోకుండా ఓడిన రెండు స్థానాలను గురించి జగన్ ఆలోచించి వుంటే పరిస్థితి వేరుగా వుండేది. ఆరోజు (మిగతా 11వ పేజీలో)



## నెల్లూరు పాటకు జాతీయ గౌరవం

10లో



## అమరజీవి త్యాగానికి సమాధి కట్టారు!
## ఆంధ్రప్రదేశ్...
# అవతరించిందా? అంతరించిందా??

***నవంబర్ 1... దాదాపు ఆరున్నర దశాబ్దాల పాటు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం. తెలుగుజాతికి ప్రత్యేక రాష్ట్రం కోసం అశువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగానికి ప్రతిరూపమిది. నవంబర్ 1 అన్నది తెలుగువారి పండుగల్లో ఒకటి. మరి అలాంటిరోజును చంద్రబాబు ప్రభుత్వం మరుగున పడేసింది. ప్రత్యేకరాష్ట్రం కోసం జరిగిన త్యాగాల చరిత్రకు సజీవ సమాధి కట్టింది.***

భారత దేశంలో ప్రతి రాష్ట్రానికీ ఒక తేదీ వుంది. ఆ తేదీకి ఒక చరిత్ర ఉంది. కాని ఏపికే వున్న చరిత్రను చించేశారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పూర్తిగా మార్చేసారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 1న చేయడం లేదు. 2014లో ఆంధ్రప్రదేశ్ (మిగతా 11వ పేజీలో)

నేదురుమల్లి ఫౌండేషన్

# స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవం

ఇంటర్ మరియు EAMCET-2016 లో అధిక మార్కులు, ర్యాంకులు సాధించి NBKRIST విద్యానగర్‌లో చేరిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నేదురుమల్లి ఫౌండేషన్ ద్వారా స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవం నిర్వహించబడును.



ముఖ్య అతిథి
శ్రీమతి ఐ.దీపా వెంకట్
మేనేజింగ్ ట్రస్టీ,
స్వర్ణభారత్ ట్రస్ట్

విశిష్ట అతిథులు
డా॥ ఎస్.కృష్ణయ్య
రిజిస్ట్రార్, జెఎన్‌టియుఏ
అనంతపురం

ఐ.శ్రీనివాస్
డిఎస్‌పి
గూడూరు.

తేది : 07-11-2016, సోమవారం
సమయం : ఉదయం 10 గం॥లకు
వేదిక: నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్ విద్యానగర్



నేదురుమల్లి రామ్‌కుమార్
ఛైర్మన్, నేదురుమల్లి ఫౌండేషన్

# స్వాతి చినుకు... రైతుకు ఊరట

నెల్లూరుజిల్లాలో ఎండ దెబ్బకు కరువు పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న రైతులకు ఇటీవల కురిసిన వర్షం తెప్పరిల్లేలా చేసింది. అక్టోబర్ నెలలో సాధారణ వర్షపాతం కురవకున్నా, ఇటీవల కురిసిన వర్షపాతం రైతులకు మేలు చేసింది. జిల్లాలోని తీరప్రాంత మండలాల్లో ఒక మోస్తరు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 46మండలాల్లో 20 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రధానంగా అల్లూరు మండలంలో అత్యధికంగా 86.4మి.మీ.లు కురవడం గమనార్హం. విడవలూరులో 52.8, నెల్లూరు 46.4, కొడవలూరు మండలంలో 34.2మి.మీలు, ఇందుకూరుపేట, కోవూరు, టిపిగూడూరు, ముత్తుకూరు, కావలి, బోగోలు మండలాల్లో ఒక మోస్తరు వర్షపాతం నమోదైంది. ఈ వర్షం నార్లు పోసిన రైతులకు కొంత మేలు చేస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. సోమశిలలో 37.697టిఎంసీల నీరు అందుబాటులో వుంది. ఇప్పటికే నారుమళ్లకు గత నెల 26 నుంచి నీటిని విడుదల చేశారు. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం వున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

# బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



బ్రాహ్మణుల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. నెల్లూరు టిడిపి జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన చంద్రన్నకు బ్రాహ్మణుల ధన్యవాద సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, వారి సంక్షేమానికి మరిన్ని నిధులు కేటాయించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఏర్పాటైన బ్రాహ్మణ కార్పొరేషన్‌లో లబ్దిదారులకే నేరుగా లబ్ది చేకూరుతుందన్నారు. విదేశాల్లో ఉన్నత చదువులు చదువుతున్న ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10లక్షల స్కాలర్‌షిప్ నిధుల చెక్కులను లబ్దిదారుల కుటుంబాలకు అందజేశారు. టిడిపి నాయకులు తాళ్లపాక రమేష్‌రెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్, ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, కొండ్రెడ్డి రంగారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బ్రాహ్మణ సంఘం నాయకులు చంద్రమౌళి, రాళ్ళపల్లి రామసుబ్బారావు, రాఘవయ్య, ఎం.వి.చలం, ప్రసాద్ ఆచార్యులు, బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా సమన్వయకర్త ఉచ్చి భువనేశ్వరప్రసాద్, జిల్లాలోని పలు ప్రాంతాల బ్రాహ్మణ సంఘం నాయకులు, బ్రాహ్మణులు సదస్సులో పాల్గొన్నారు.

# వేడుకగా చిన్నజియ్యర్‌స్వామీజీ 60వ జన్మదినోత్సవం

అరవై వసంతాలు పూర్తిచేసుకున్న చిన్నజియ్యర్ స్వామీజీ జన్మదినోత్సవ వేడుకలను నెల్లూరులోని ఉస్మాన్‌సాహెబ్‌పేటలో వున్న శ్రీ కోదండరామస్వామి ఆలయంలో రెండురోజులపాటు ఘనంగా నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో జరిగిన ఈ వేడుకల్లో అనేకమంది పాల్గొని చిన్నజియ్యర్‌స్వామీజీ ఆధ్యాత్మికరంగానికి చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రామస్థూప నిర్మాణ కమిటీ సభ్యుడు కెటి రామానుజం మాట్లాడుతూ, చిన్నజియ్యర్‌స్వామీజీ 60వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 60 సామాజిక సేవాకార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదాంతాచార్యులు కెపిఎస్ రామానుజం, భక్తవత్సలం, శ్రీ హరిహరనాథ భజనమండలి అధ్యక్ష కార్యదర్శులు గుండ్లపల్లి నిరంజన్‌రెడ్డి, పద్మప్రియ పాల్గొన్నారు.

# కరెంట్ దొంగలపై విజిలెన్స్ పంజా

- రూ.7.88లక్షలు వసూలు

కరెంట్ దొంగలపై విజిలెన్స్ పంజా విసిరింది. నెల్లూరుజిల్లా వాకాడు మండలంలో ఆక్వా రంగంలో కరెంట్‌ను దొంగతనంగా వాడుతున్న వారిపై సోమవారం రాత్రి విద్యుత్ విజిలెన్స్, ఏపిటిఎఫ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు విద్యుత్ విజిలెన్స్ డివిజనల్ ఇంజనీరు విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. వాకాడు మండలంలోని వావిళ్లపాలెం, కొండూరుపాలెం, దుగరాజపట్నం ప్రాంతాల్లో ఆక్వా కల్చర్ వినియోగంపై తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. వావిళ్లపాలెంలోని ఆక్వారైతు వలిపి వెంకయ్య విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించి తనిఖీలు చేయగా సిటీమీటరును బైపాస్ చేసి విద్యుత్ వినియోగం చేస్తున్నట్లు గుర్తించామని, విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు నిర్ధారించి అతనికి రూ.7.88లక్షల అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏపిటిఎఫ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ, సిబ్బంది, ట్రాన్స్‌కో ఏడిఈలు ఎం.శ్రీనివాసులు, ఎ.రవినారాయణ, ఏఈలు పాల్గొన్నట్లు తెలిపారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఏడిఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# తిరుమలలో సాధారణ భక్తులకు ప్రాధాన్యత

## - టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి



తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునే సాధారణ భక్తులకు దేవస్థానం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి చెప్పారు. సోమవారం జిల్లాలోని నాయుడుపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ వళ్ళీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో జరుగుతున్న వారోత్సవాల్లో పాల్గొని, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాయుడుపేట పట్టణం తనకు ధర్మం నేర్పిందని, ఫలితంగా టిటిడి పాలకమండలి అధ్యక్షునిగా తనకు ఆ వేంకటేశ్వరస్వామి సేవ చేసుకునే భాగ్యం దక్కిందని అన్నారు. తిరుమలలో గతంలో మంచినీటి సమస్య వుండేదని, అయితే గత రెండేళ్లుగా వరుణుడి కరుణతో భక్తులకు మంచినీటి సమస్యలు తొలిగాయని అన్నారు. తిరుమల పరిసరాల పరిశుభ్రతను స్వయంగా పరిశీలించిన ప్రధాని నరేంద్రమోదీ తిరుమలకు స్వచ్ఛభారత్ అవార్డును ఇచ్చారని, ఇది ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. నాయుడుపేట పట్టణాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఇక్కడి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి చాలా కొద్దికాలంలోనే మంచి గుర్తింపు లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. నాయుడుపేటకు త్వరలో ఉజ్వల భవిష్యత్తు వుందని, ఈ ప్రాంతం విద్యారంగంలోనూ ముందుంటోందన్నారు. చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం లభిస్తుందని అంటూ, విద్యార్థులంతా కష్టపడి చదువుకుని నాయుడుపేటకు ఇంకా మంచి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. నాయుడుపేటలోని పుదూరు కూడలిలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చదలవాడను ఆర్యవైశ్య సంఘం నాయకుడు ఎం.కృష్ణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.రాజగోపాల్, కె.సురేష్ తదితరులు సన్మానించారు. తొలుత, చదలవాడ నాయుడుపేట పట్టణంలోని జంబుకేశ్వర స్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయంతో పాటు శ్రీకృష్ణమందిరాన్ని దర్శించుకుని పూజలు చేశారు.

సింహపురి సమాచారం

# సింధూ ఆదర్శం కావాలి

- డక్కిలిలో గుంటూరుజోన్ క్రీడాపోటీలు
- ప్రారంభించిన వెంకటగిరి ఎమ్మెల్యే



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల బాలికల గుంటూరుజోన్ 3వ జోనల్ క్రీడాపోటీలు మంగళవారం డక్కిలిలోని పుల్లారెడ్డి స్మారక క్రీడా ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రియో ఒలింపిక్స్‌లో వెండిపతకం సాధించిన సింధూను క్రీడాకారులందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డక్కిలిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు, మినీ స్టేడియం మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జోనల్ క్రీడల అధికారి జయప్రకాష్, ఎంపిపి పోలంరెడ్డి వెంకటరెడ్డి, జడ్పీటిసి సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రనాయుడు, గురుకుల పాఠశాలల కన్వీనర్ హేమలత, డక్కిలి గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ జయభారతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు విభాగాల్లో ప్రారంభమైన పోటీల్లో ప్రకాశం, గుంటూరు, నెల్లూరుజిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్ జూనియర్ పోటీల విభాగంలో అమరావతి గురుకుల పాఠశాల విజయం సాధించింది.

అదేవిధంగా నాగార్జునసాగర్-అద్దంకి జట్ల మధ్య జరిగిన పోటీల్లో నాగార్జునసాగర్ జట్టు, సూళ్లూరుపేట-నాగులపాలెం జట్ల మధ్య జరిగిన పోటీల్లో సూళ్ళూరుపేట జట్టు, పుదూరు-కొత్తకోడూరు జట్ల మధ్య జరిగిన పోటీల్లో కొత్తకోడూరు జట్టు విజయం సాధించాయి. జూనియర్ త్రోబాల్ పోటీల విభాగంలో సూళ్ళూరుపేట, బోగోలు జట్లు విజయం సాధించగా, సీనియర్ కబడ్డీ పోటీల విభాగంలో కొత్తకోడూరు జట్టు, పుదూరు జట్టు విజయం సాధించాయి. ఈ క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా తొలుత క్రీడాప్రాంగణంలో విద్యార్థినులు మార్చ్‌ఫాస్ట్ చేశారు. ముఖ్యఅతిథులు వారినుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు.

# ఆరోగ్యాన్నిచ్చే.. ఆయుర్వేదం

## డాక్టర్ చక్రవర్తి

వ్యాధుల బారి నుంచి రక్షించి మంచి ఆరోగ్యాన్నిచ్చే ఆయుర్వేదం గురించి ప్రజలకు మరింత అవగాహన కలిగేలా కృషి చేయాల్సి వుందని శ్రీ జయేంద్ర సరస్వతి ఆయుర్వేద వైద్య కళాశాల (చెన్నై) విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి అన్నారు. ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతి సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో గతనెల 28న జరిగిన ఆయుర్వేద సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో వ్యాధులను నివారించి ఆయుష్షును పెంచే గుణం ఆయుర్వేదంలో వుందని, భారతదేశంలో ఎంతో ప్రాచీనకాలం నుంచి వున్న ఈ ఆయుర్వేద వైద్యానికి ఇటీవలి కాలంలో మంచి ఆదరణ పెరుగుతోందని అంటూ, ఆయుర్వేదం పట్ల ప్రజల్లో మంచి అవగాహన కలిగించేందుకు అందరూ చొరవతీసుకోవాలన్నారు. ఆయుష్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ, జిల్లాలో 43ఆయుష్ వైద్యశాలలు వున్నాయని, అయితే వీటిలో సరైన వైద్యులు లేక, వసతులు లేక ప్రజలకు వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఆయుర్వేద వైద్యశాలల దుస్థితిని గమనించి వాటి అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైద్యుల ఖాళీలను భర్తీచేసి ఆయుర్వేద వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రఘురామరెడ్డి, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంజిబిలో క్యాండిల్స్‌పై వర్క్‌షాపు

దీపావళి పండుగను పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలోని ఎంజిబి ఫెలిసిటీ మాల్‌లో మాగుంట లేఅవుట్‌లోని కైట్స్ స్కూలు నిర్వాహకులు విద్యార్థులకు డెకరేటివ్ క్యాండిల్స్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. కరస్పాండెంట్లు చక్రధర్‌రెడ్డి, సుస్మితారెడ్డిలు ఖర్చు లేకుండా క్యాండిల్స్ తయారీపై వివరించారు. ఎంజిబి గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్లు ఎం.ఆర్.గంగాధర్, ఉమాగంగాధర్‌లు మాట్లాడుతూ విద్యార్థుల కోసం వర్క్‌షాపును నిర్వహించడం అభినందనీయమన్నారు.

# 'గిరి'పైనే 'దేశం' గురి



- నాడు వివాదాలకు దూరం
- నేడు విమర్శలతోనే స్నేహం

***కాకాణి గోవర్ధన్‌రెడ్డి(గిరి)... జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా ఐదేళ్ల పదవీ కాలంలో రాజకీయాలకతీతంగా అందరి మన్ననలు పొందిన నాయకుడు. జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా జిల్లాలో ఒక కొత్త ట్రెండ్ సృష్టించాడు. నిజాయితీ, నిబద్ధతతో పనిచేసి స్ఫూర్తివంతంగా నిలిచాడు. తన పనితీరుతో ప్రత్యర్థులను సైతం ఆకట్టుకున్నాడు. 2014 ఎన్నికలప్పటికి ఇతను జిల్లాలో ఏ అసెంబ్లీ నుండి పోటీ చేసినా గెలుస్తాడు అన్న పేరు తెచ్చుకున్నాడు. జడ్పీ ఛైర్మెన్‌గా ప్రశంసలు తప్ప విమర్శలు ఎదుర్కోని నాయకుడు. 2014లో సర్వేపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుండి విమర్శలు ఎదుర్కోవడం తప్ప ప్రశంసలు పొందడం లేదు.***

జిల్లాలో ప్రతిపక్ష పార్టీకి అధ్యక్షుడాయన! అధికారపక్షంపై విమర్శలు సంధించడంలో ఆయనే ముందుండాలి. అధికారపార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ పనితీరును చీల్చి చెండాడుతుండాలి. అలాంటిది ఇటీవలకాలంలో ప్రత్యర్థులు ఆయన మీద విమర్శల దాడి తీవ్రతరం చేశారు. వ్యూహాత్మకంగానే ఆయనపై ఆరోపణల దాడులు జరుగుతున్నాయి. ఒకదాని తర్వాత ఒకటి... ఆయన చుట్టూ వివాదాలు, సమస్యలు పోగవుతున్నాయి. ఇందులో అధికారపార్టీ ప్రమేయం ఖచ్చితంగా వుందనడంలో అతిశయోక్తి లేదు. ఇటీవల సర్వేపల్లి కేంద్రంగా సాగుతున్న గ్రావెల్ అక్రమరవాణాలో కాకాణి అనుచరులున్నారంటూ మీడియాలో వార్తలు రావడం తెలిసిందే! ఆ తర్వాత నెల్లూరురూరల్ మండలం ధనలక్ష్మీపురంలో ఎస్సీల భూములను కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆక్రమించుకున్నాడంటూ కథనాలు వచ్చాయి. ఈ వివాదం ముగియగానే ఎన్నికల నాటి నకిలీ మద్యం కేసు తెరపైకి వచ్చింది. నకిలీ మద్యం కేసులో వైకాపా ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలను నిందితులుగా చేర్చే ప్రక్రియ జరుగుతోంది. ఈ కేసును బూచిగా చూపి ఈ ఇద్దరు ఎమ్మెల్యేలను కూడా తమ పార్టీలోకి లాగాలని తెలుగుదేశం నాయకులు తీవ్రంగానే ప్రయత్నించారు. ఒక దశలో వీరిద్దరూ పార్టీ మారుతారనే ప్రచారం కూడా జోరుగానే సాగింది. తర్వాత ఆ ప్రచారానికి తెరపడింది. పార్టీ మారకపోవడంతో నకిలీ మద్యం కేసును మళ్లీ వేగవంతం చేసారు. కాకాణికి ఈ తలనొప్పి ఇలా ఉండగానే ఆయన తమ ప్లాట్లు ఆక్రమించుకున్నాడని ధనలక్ష్మీపురంలోని ఓ లేఅవుట్‌లో ప్లాట్లు కొన్న వ్యక్తులు ఎస్పీని ఆశ్రయించారు. ఇందులో వాస్తవమెంతో తెలుసుకోకుండానే అధికారపార్టీ అనుకూల పత్రికలు ఆయనను పెద్ద భూకబ్జాదారుడిగా ప్రచురించాయి. రెవెన్యూ రికార్డులను పరిశీలించి, సర్వే జరిపితే ఎవరి భూమి ఎవరు ఆక్రమించుకున్నారో తెలుస్తుంది. కొందరు రియల్టర్ల సంగతి తెలిసిందే కదా! పది ఎకరాలు కొంటే పక్కన వున్న ఒకట్రెండు ఎకరాలను కూడా కలుపుకుని లే అవుట్లు వేస్తుంటారు. భూమి యజమానులు కలతెలుసుకుని తమ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే నాటికి రియల్టర్లు అక్కడ ప్లాట్లు అమ్మేసుంటారు. కాబట్టి అసలిక్కడ రియల్టర్ కొన్న భూమి విస్తీర్ణమెంత, వేసిన లే అవుట్ విస్తీర్ణమెంత... అన్నది సర్వేచేసినా, రికార్డులు చూసినా తెలిసిపోతుంది.

కాకాణి మీద ఏ స్థాయిలో ఎంత బురద పడాలో అంత పడింది. జడ్పీ ఛైర్మెన్‌గా ఎంత మంచి పేరు వచ్చిందో, ఎమ్మెల్యేగా అంత వివాదాస్పదుడిని చేసిపెట్టారు. ప్రత్యక్ష రాజకీయాల్లో నిలబడాలంటే ఈ గబ్బుని భరించాలి, లేకుంటే తప్పుకోవాలి.

## హృదయ'రాజు'కు
# స్వర రారాజు అభినందన



వైద్యవృత్తిలో అంకితభావంతో పనిచేస్తూ తన ఆధ్వర్యంలో 20వేల గుండె ఆపరేషన్‌లను విజయవంతంగా పూర్తి చేసిన కిమ్స్ ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.ఎస్.శ్రీనివాసరాజును పద్మభూషణ్, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభినందించారు. ఇటీవల నెల్లూరు కొచ్చిన బాలును శ్రీనివాసరాజు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సమయంలో శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో 20వేల గుండె ఆపరేషన్లు విజయవంతంగా జరిగిన విషయాన్ని మిత్రుల ద్వారా తెలుసుకున్న ఆయన, మీలాంటి వైద్యుడు మా నెల్లూరులో ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమని, మీ నుండి నెల్లూరీయులకు మరిన్ని వైద్యసేవలు అందాలని ఆకాంక్షిస్తూ అభినందించారు.



ఈ నెల 3వ తేదీ గురువారం స్వర్గీయ డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి తనయుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని హైదరాబాద్, లోటస్‌పాండ్‌లోని ఆయన స్వగృహంలో 'లాయర్' నిర్వాహకుడు ప్రభు కలిసాడు. తన కుమారుడు శివప్రజిత్‌తో కలిసి జగన్‌తో స్నేహపూర్వకంగా ముచ్చటించాడు. 'లాయర్' కుటుంబానికి, వై.యస్.కుటుంబానికి వున్న అనుబంధాన్ని, సంబంధ బాంధవ్యాల్ని ఈ సందర్భంగా నెమరు వేసుకున్నారు.

# ఎక్కడి చెత్త..అక్కడే!




నెల్లూరు నగరం మళ్ళీ ఒక మురుగు దిబ్బగా కనిపిస్తోంది. ఎక్కడ చూసినా కంపే. ఏ రోడ్డు చూసినా చెత్తే. చెత్తకుప్పలు, మురుగు వాసన.. నెల్లూరుకు కొత్తేమీ కాకపోయినా పారిశుద్ధ్య కార్మికుల ఆందోళనతో ఆ దుర్వాసన మరింత పెరిగింది. ప్రధాన రోడ్లతో సహా అన్ని రోడ్లు చెత్తాచెదారంతో నిండిపోతుండడంతో నగరం కుళ్ళుకంపు కొడుతోంది. ఇళ్ళ నుంచి నేరుగా చెత్తబండ్లు వచ్చి చెత్త తీసుకుపోతుండడంతో ఇన్నాళ్ళు ఈ బాధ తెలియలేదు. ఇప్పుడు ఆ కార్మికులు తమ సమస్యల సాధన కోసం ఆందోళన బాట పట్టడంతో నెల్లూరులో చెత్తాచెదారం తొలగించే వారు లేక వూరంతా గబ్బుపట్టిపోతోంది. ఈ చెత్తతో దోమలు ప్రబలిపోయి జబ్బులెక్కడ దాపురిస్తాయోనని ప్రజలు భయపడుతున్నారు. పారిశుద్ధ్య వ్యవస్థలో 279వ నంబరు జీఓను రద్దు చేయాలని కార్మికులు కోరుతున్నా అటు ప్రభుత్వంకానీ, ఇటు నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు కానీ పట్టించుకోకపోవడంతో కార్మికులు సమ్మె బాట పట్టారు. గత నెల 28 నుంచి వారు విధులను బహిష్కరించి రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. ఈ జిఓ అమలు చేయవద్దని కోరుతున్నా అధికారులు పట్టించుకోక జిఓ అమలుకే నిర్ణయం తీసుకోవడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమ్మెకి దిగారు. రోజుకు నగరంలో సుమారు 3 వందల టన్నుల దాకా చెత్త పేరుకుపోతుంటుంది. నగరంలోని ప్రధాన వీధులు, ప్రధాన కూడళ్లు అంతా చెత్తాచెదారమే. చెత్త తొలగించే పారిశుద్ధ్య కార్మికులు విధులకు రాకపోవడంతో అధికారులు అదనపు సిబ్బంది ద్వారా, యంత్రాల ద్వారా పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తుండడంతో కార్మికులు అందుకు తమ నిరసన వ్యక్తం చేస్తూ అడ్డుకుంటున్నారు. దీంతో పరిస్థితి దయనీయంగా మారుతోంది. చెత్త, మురుగుదిబ్బలు పేరుకుపోతుండడం, సైడు కాలువల్లో మురుగునీరు రోడ్లపైకి వస్తుండడంతో నగరంలో అనేక ప్రాంతాలు గబ్బుగబ్బుగా తయారయ్యాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రజారోగ్యం కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, పరిస్థితి మరింతగా జటిలం కాకుండా కార్మికుల సమస్యలను పరిష్కరించి నగరంలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రారంభమైన...
# పోలీస్ పెట్రోల్‌బంకు



నెల్లూరులోని జిల్లా పోలీస్ కార్యాలయం ఎదురుగా పోలీస్ గ్రౌండ్స్‌లోని ఖాళీస్థలంలో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌వారి సహకారంతో బుధవారం పోలీస్ ఫ్యూయల్ స్టేషన్ ప్రారంభమైంది. దీనికి జిల్లా ఎస్పీ విశాల్‌గున్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాకు తమ పోలీసు సిబ్బంది అందిస్తున్న సేవల వలె అత్యుత్తమ సర్వీస్ ఇక్కడ అందుబాటులో వుంటుందన్నారు. ఈ ఫ్యూయల్ స్టేషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పూర్తిగా జిల్లా పోలీసులు, వారి కుటుంబాల సంక్షేమానికి వినియోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి బి.శరత్‌బాబు, హెచ్‌పి సిఎల్ మేనేజర్ సత్యనారాయణ, డిప్యూటి మేనేజర్‌లు చంద్రకాంత్, పవన్ కుమార్, డిఎస్పీలు కోటిరెడ్డి, జెవి రాముడు, విఠలేశ్వరరావు, చెంచురెడ్డి, శ్రీనివాసరావు, సుధాకర్, రామారావు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, ఎస్‌బి, టౌన్ సిఐలు, ఆర్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## 'ప్రభా'తం

# సంస్కరణలే ప్రగతికి దారి

**మహిళాభ్యుదయాన్ని కాంక్షిస్తూ, అభివృద్ధి పథంలో దేశం అగ్రగామిగా వుండాలనుకుంటున్న ఈ తరుణంలో ఇంకా మనదేశంలోని మహిళలు అనేకరకాల వివక్షలకు గురవుతుండడం బాధాకరం. ఇకనైనా ఈ తీరు మారుతుందని ఆశిద్దాం. వ్యక్తి కన్నా సమాజం ముఖ్యం. ఏ సమాజానికైనా దేశమే ముఖ్యం.. దేశసౌభాగ్యమే ముఖ్యం. ఈ 21వ శతాబ్దంలో కూడా మహిళల పట్ల వివక్ష తగదు. ఇకనైనా సంస్కరణల బాటలో సాగాలి. దేశప్రగతే లక్ష్యంగా అందరూ ముందుకు పయనించాలి!**

**"గర్భస్థ ఆడశిశువులను చంపడం పాపం. ఆ పాపం చేసేవారు హిందువులైనా సరే ఆ దురాచారాన్ని రూపుమారపాల్సిందే. కుమార్తెలు, తల్లులు, ఆడపడుచులను మనం రక్షించుకోవాలి. ఇందులో మతం ప్రసక్తి వుండకూడదు. ఇప్పుడు తలాక్ అంశం తెరపైకి వచ్చింది. అయినా, ఫోన్‌లో తలాక్ చెప్పేసి జీవితాలను నాశనం చేయడానికి నా ముస్లిం ఆడపడుచులు చేసిన పాపమేమిటి?" - ప్రధాని నరేంద్ర మోడీ.**

"తలాక్ చెప్పడం ద్వారా విడాకులు తీసుకునే వ్యవహారం పూర్తిగా ముస్లింల అంతర్గత విషయం. అయితే దాని ద్వారా ఎదురవుతున్న నష్టాల తీవ్రతపై ముస్లిం సమాజం విశ్లేషించుకోవల్సిన అవసరమైతే వుంది. అయినా, ప్రస్తుత కాలంలో లింగ వివక్షత మంచిది కాదు. స్వయంగా ముస్లిం మహిళలే ఈ విషయమై సుప్రీంకోర్టుకు వెళ్లారు. వారు కోరుకుంటున్నట్లుగా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం. ముస్లింసమాజం కూడా ఈ విషయమై మానవీయ దృష్టితో ఆలోచించాలి" - ఆర్‌ఎస్‌ఎస్.

దేశంలో ఇప్పుడు తలాక్ అంశం ఎంతో చర్చనీయాంశంగా వుంది. స్వయంగా ప్రధాని నరేంద్రమోడీ ఈ విషయమై తన అభిప్రాయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పడంతో ఈ అంశం మరింత చర్చగా మారింది. అయితే, ప్రధాని అభిప్రాయం దేశప్రజలందరిలోనూ ఒక స్పష్టతనిస్తోంది..ఒక సరికొత్త ఆలోచననిస్తోంది. భారత ప్రధానిగా నరేంద్రమోడీ పదవిని అధిష్టించిన తరువాత గడిచిన రెండున్నర సంవత్సరాల్లో తన ప్రసంగాల్లో ఎంతో సంయమనాన్ని, పరిపక్వతను ప్రదర్శిస్తున్నారనేందుకు ఈ విషయంపై ఆయన ప్రసంగమే ఒక తాజా ఉదాహరణ.. ఎంతో సున్నితమైన అంశాలను కూడా ప్రధాని ప్రస్తావిస్తూనే ఆ అంశాలకు సంబంధించి ఎలాంటి వివాదాలు తలెత్తకుండా చూస్తున్నారు. తలాక్ అంశం మరెంతో సున్నితమైనది. అయినా, ప్రధాని ఎంతో సంయమనంతో, నచ్చజెప్పేధోరణితో ఆ అంశంపై మాట్లాడడం దేశప్రజలను బాగా ఆకట్టుకుంది. ఫోన్‌లో మూడుసార్లు తలాక్ చెప్పి మహిళల జీవితాన్ని నాశనం చేయవచ్చునా?..ఆలోచించుకోవాలంటూ..ఆయన వేసిన సూటిప్రశ్న అందరిలోనూ ఆలోచనలు రేకెత్తిస్తోంది.

ఒకప్పుడు సమాజ సంస్కరణలకు ఎవరో ఒక మహానుభావుడు కంకణం కట్టుకునేవారు. అప్పటి సమాజంలో వున్న ఎన్నో దురాచారాలు ఇప్పుడు రూపుమాసిపోయాయంటే అందుకు ఎంతో పుణ్యం కట్టుకున్నవారెందరో వున్నారు. మతాచారాలు, సాంఘిక దురాచారాల పేరిట అనాదిగా మహిళాలోకానికి జరుగుతున్న అన్యాయాలను ఎన్నో ఏళ్ళ క్రితమే రాజరామమోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు వంటి సమాజ సంస్కర్తలు ఎదిరించారు. అది ఏరకమైన ఆచారమైనా, సంప్రదాయమైనా అది ప్రజలకు మరింత క్షేమాన్ని, సంతోషాన్ని ఇచ్చేదిగానే వుండాలే తప్ప, అది వేదనగానో.. వారి జీవితాలను నాశనం చేసేదిగానో వుండకూడదన్నది ఆ మహనీయుల ఆశయం. సరిగ్గా ఇప్పుడు ఆ గొప్ప సంస్కరణ పాత్రను నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వమే పోషిస్తుండడం ఎంతైనా ఆహ్వానించదగ్గ పరిణామం. అప్పట్లో సమాజ సంస్కర్తలు తమ సంస్కరణలకు అనువుగా తగు చట్టాలను రూపొందించి సమాజక్షేమాన్ని కాంక్షించాలని ప్రభుత్వాలను కోరేవారు. ఇప్పుడు ఆ ప్రయాస కూడా లేకుండా నేరుగా భారత ప్రభుత్వమే ప్రజల సంక్షేమం కోసం అనువైన సంస్కరణలకు శ్రీకారం చుడుతోండడం ఎంతో అభినందనీయం. ఇది మానవీయ సంస్కరణలకు ఎంతో దగ్గరి దారి అని భావించవచ్చు. అందుకే, తలాక్ అంశాన్ని రాజకీయకోణంగా కాక, మానవీయ దృక్పథంతో చూడాల్సివుందని ప్రధాని అంటున్నారు. మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలు వుండకూడదని, అలాగే మతం ప్రాతిపదికన వారు వివక్షను ఎదుర్కోకూడదని సుప్రీంకోర్టుకు కేంద్రప్రభుత్వం విన్నవించిందని, దీనిపై ప్రజాస్వామ్యంలో చర్చ జరగాలని కూడా ఆయన కోరుతున్నారు. అంతేకాదు, తలాక్ విధానం ద్వారా ముస్లిం మహిళల జీవితాలను నాశనం కావడాన్ని అనుమతించరాదని కూడా ఆయన స్పష్టం చేశారు. ముస్లిం మహిళల హక్కులను పరిరక్షించాలా లేదా?..వారికి సమానహక్కులు వుండాలా వద్దా?..అని ఆయన సూటిగా ప్రశ్నించారు. కొన్ని పార్టీలు ఓటుబ్యాంకు రాజకీయాల కోసం మహిళలకు అన్యాయం చేయాలనుకుంటున్నాయి. ఇదేం న్యాయం?.. అని ఆయన ప్రశ్నించి అందరిలోనూ ఆలోచన పెంచారు. మనదేశంలో భిన్నమతాలు.. విభిన్న మనస్తత్వాలు.. రకరకాల ఆచారాలు, సంప్రదాయాలు ఎన్నో వున్నాయి. అయినప్పటికీ భిన్నత్వంలో ఏకత్వం మనదేశానికి ఒక అద్భుతమైన వరం. అదే మనదేశ ఖ్యాతికి నిదర్శనం. మనదేశంలో ప్రతి మతానికి అనాదిగా కొన్ని సంప్రదాయాలు వున్నప్పటికీ, మారుతున్న పరిస్థితులనుబట్టి ఆ సంప్రదాయాలు మార్పులకు గురవుతూనే వున్నాయి. హిందూమతంలో ఇప్పటికే అలాంటి మార్పులెన్నో జరిగాయి. తలాక్ అంశంపై కూడా ఆమేరకు మానవతా దృక్పథంతో ఆలోచించాలని ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా వుంది. ఆయావర్గాల ప్రముఖులతోను, మేధావులతోనూ సమగ్రంగా చర్చించి, ఏ మేరకు ఏ విధానం అనుసరిస్తే అది అందరికీ ఆనందకరంగా వుంటుందో అందరూ కలసి ఆలోచించి ఒక సముచితమైన నిర్ణయంతో ముందుకు సాగాల్సి వుంది. ఏదేమైనా వ్యక్తి కన్నా సమాజం ముఖ్యం. ఏ సమాజానికైనా దేశమే ముఖ్యం..దేశసౌభాగ్యమే ముఖ్యం. ఈ 21 వ శతాబ్దంలో దేశం అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో శరవేగంతో ప్రగతిమార్గంలో దూసుకుపోతున్న తరుణంలోనూ ఇంకా మహిళల పట్ల ఇంకా వివక్షలా?.. ఇకనైనా సంస్కరణలను సహృదయంతో స్వాగతించాలి! దేశాభ్యున్నతే లక్ష్యంగా ప్రతిఒక్కరూ దేశ ప్రగతికి దారులు వేస్తూ ముందుకు సాగాలి!...

# లక్ష మంది అక్షరాస్యత లక్ష్యం

**- ఆర్.ఎస్.రాజ్‌కుమార్**



జిల్లాలో నిరక్షరాస్యులను దాదాపు లక్షమందిని అక్షరాస్యులుగా చేసేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి సాక్ష్యరత కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ – 2 ఆర్.ఎస్.రాజ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎ.జె.సి ఛాంబర్లో సాక్షరత కార్యక్రమంపై సంబంధిత అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాక్షరతా కార్యక్రమం క్రింద జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లాలో లక్షమంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో సంబంధిత డి.ఆర్.డి.ఎ., ఎన్.ఆర్.ఇ.జి.ఎస్., ఎస్.సి. కార్పొరేషన్, సెట్నల్ శాఖల అధికారుల సమన్వయంతో వారి పరిధిలో వున్న కో–ఆర్డినేటర్లు, వాలంటీర్లు, యూత్ సర్వీస్ సభ్యులు, తదితర వాలంటీర్లతో అవసరమైన శిక్షణనిచ్చి అక్షరాస్యత కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వయోజనవిద్య శాఖ డిప్యూటి డైరెక్టర్ నారాయణమ్మ, డిఆర్‌డిఎ పి.డి లావణ్యవేణి, సెట్నల్ సిఇఓ సుబ్రహ్మణ్యం, ఎస్సీ కార్పొరేషన్ అధికారి జయరాం పాల్గొన్నారు.

# గాయని రాధిక సుబ్రహ్మణ్యంకు సత్కారం



పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులోని విఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్టడీస్ సెంటర్‌లో మచిలీపట్నంకు చెందిన ప్రముఖ గాయని, సంగీత గురువులు యేలేశ్వరపు రాధికా సుబ్రహ్మణ్యంకు "స్వరమాధురి" బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ వాస్తు శాస్త్ర నిపుణులు వాస్తు రామచంద్ర మాట్లాడుతూ సంగీతం కోసమే జీవిస్తూ ఎంతోమందికి సంగీతాన్ని నేర్పించిన రాధికా సుబ్రహ్మణ్యం సేవలకు గుర్తుగా సత్కరించడం సముచితమన్నారు. ఈ కార్యక్రమంలో వొమ్మిన నాగసతీష్, నలుబోలు బలరామయ్యనాయుడు, అందె శ్రీనివాసులు, కె.మురళీమోహన్‌రాజు, వి.తనూజారెడ్డి, భావతరంగిణి సంపాదకులు భవిష్య, రవి గోగులపల్లి, సాయికుమార్‌రెడ్డి పాల్గొని రాధికాసుబ్రహ్మణ్యంను సత్కరించారు.

# నేత్రదాన అంగీకారం



నెల్లూరు దర్గామిట్ట డిసిఆర్ జడ్‌పిపి బాలుర ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న నెలవల శ్యామల సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆమె నేత్రదాన అంగీకారపత్రంపై సంతకం చేశారు. ప్రధానోపాధ్యాయులు కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటివరకు మన స్కూలులో ఉపాధ్యాయురాలిగా పిల్లలకు బోధన చేసి పదవీవిరమణ రోజున గుర్తుండే విధంగా నేత్రదానం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. నేత్రదాన మోటివేటర్ బయ్యాప్రసాద్, ఇన్‌ఛార్జ్ హెచ్‌యం బి.రామమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్వరాజ్యలక్ష్మి, నరసింహారావు, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.




# ఇబ్బందిగా మారిన ఫ్లైఓవర్

నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్ వంతెన మహాచికాకుగా మారింది. దీనివల్ల పెద్దగా ఉపయోగం లేకుండాపోయింది. ఆత్మకూరు బస్టాండ్‌లోకి వెళ్లే బస్సులు అప్రోచ్ రోడ్డులో పోతున్నాయి. ఈ రోడ్డును పూలు, పండ్లు కొట్లవాళ్లు ఆక్రమించుకోవడం మూలంగా ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ సమస్య పరిష్కారం కావాలంటే బర్మాషెల్‌గుంట వద్దకు ఆత్మకూరు బస్టాండ్‌ను మార్చాలి. దీనివల్ల ఆత్మకూరు, కావలి వైపు నుండి వచ్చే బస్సులకు ఇక్కడిదాకా వచ్చే పనుండదు.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# ప్రజల్లో చైతన్యం

ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్‌కు వంత పాడుతున్న చైనాకు బుద్ధిచెప్పేందుకు సోషల్ మీడియాలో ఆ దేశానికి వ్యతిరేకంగా జరిగిన ప్రచారం సత్ఫలితాలనే ఇచ్చినట్లుంది. ఈ దీపావళికి చైనా టపాసులను కొనొద్దంటూ చాలామంది చేసిన విజ్ఞప్తికి ప్రజలు బాగానే స్పందించారు. టపాసుల దుకాణాలకు వెళ్లినప్పుడు చైనా ఉత్పత్తులు కానటువంటి టపాకాయలనే అడిగిమరీ కొన్నారు. సోషల్ మీడియా ప్రచారం వల్ల చైనా టపాకాయల అమ్మకాలు సగానికి సగం పడిపోయాయి. మిగతా చైనా వస్తువుల విషయంలోనూ భారతీయులు ఇదే చైతన్యం చూపించాలి.

**– పి.కార్తీక్ భరద్వాజ్, నెల్లూరు.**

# శంకుస్థాపనలతోనే సరి!

ముఖ్యమంత్రి చంద్రబాబు కడుతున్న అమరావతి రాజధాని ఎలా వుంటుందో, ఏ తరం వాళ్లు దానిని చూస్తారోగాని పుణ్యకాలం కాస్తా శంకుస్థాపనలతోనే సరిపోతోంది. ఎన్నిసార్లు శంకుస్థాపనలు చేస్తారు, ఎంతమంది చేత శంకుస్థాపనలు చేయిస్తారు. ఒక రాజధాని కోసం ఇంత బిల్డప్ అవసరమా? ఇన్ని కోట్ల రూపాయలను శంకుస్థాపనల పేరుతో తగలబెట్టాల్సిన అవసరముందా? శంకుస్థాపనలు మూడేళ్ల దాకా చేస్తూనే వున్నారు. ఇక రాజధానిలో భవనాలు పూర్తయ్యేదానికి ముప్పై ఏళ్లన్నా పడుతుందేమో?

**ఎల్.కొండారెడ్డి, బి.గూడూరు.**



# వెంకయ్య ఇంట దీపావళి కాంతులు

మన పండుగలు, మన సంప్రదాయాలను బాగా పాటించే కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు ఆదివారం దీపావళి వేడుకలను ఢిల్లీలోని తన నివాసంలో కుటుంబసభ్యులతో కలిసి ఎంతో ఆనందంగా జరుపుకున్నారు. తన సతీమణి శ్రీమతి ఉషమ్మతో కలిసి లక్ష్మీపుజ చేశారు. ఆ తర్వాత మనుమలు, మనుమరాళ్లతో కలిసి టపాకాయలు కాల్చి దీపావళి వేడుకల్లోని సంతోషాన్ని ఆస్వాదించారు.



# మేకపాటిలో కలవరం

## ఉపఎన్నికపై జగన్ ఝలక్

**ప్రత్యేకహోదా పోరాటంలో భాగంగా అవసరమైతే తమ పార్టీ ఎంపీల చేత రాజీనామా చేయించి ఉపఎన్నికలకు పోతామన్న వైకాపా అధ్యక్షుడు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాట మిగతా ఎంపీల సంగతేమోగాని నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డికి మాత్రం కంటిమీద కునుకులేకుండా చేస్తున్నట్లే వుంది. ఎక్కడ రాజీనామాలు చేయమంటాడోనని ఈయన అదురుకుంటున్నాడు.**

ఐదేళ్లకోసారి ఎన్నికల్లో నిలబడాలంటేనే అభ్యర్థులకు తడిసి మోపెడవుతుంది. అలాంటిది ఐదేళ్లలో రెండు ఎలక్షన్‌లు చేయాలంటే మాటలా? అదీగాక నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పరిస్థితి ఏమంత బాగాలేదు.

ఇప్పటికిప్పుడు నెల్లూరు లోక్‌సభ ఉపఎన్నికలు జరిగితే తిరిగి మేకపాటి రాజమోహన్‌రెడ్డి గెలుస్తాడన్న గ్యారంటీ లేదు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత వుంది. అది కూడా తారాస్థాయిలో వుంది. అయితే అదిప్పుడు ఓటు రూపంలో వ్యక్తం కావడం కష్టం. ఎందుకంటే ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల గడువుంది. గ్రామస్థాయిల్లో కూడా అధికారపార్టీతో అవసరాలు చాలా వుంటాయి. కాబట్టి జగన్ పట్ల అభిమానమున్నా కూడా నాయకులు, ప్రజలు అప్పుడే బయటపడరు. ఇక 2014ఎన్నికలప్పుడు చూస్తే ఆత్మకూరు, నెల్లూరురూరల్ నియోజకవర్గాలలో తెలుగుదేశానికి సరైన నాయకత్వమే లేదు. ముఖ్యంగా ఆత్మకూరులో తెలుగుదేశం అభ్యర్థి బలహీనం కాబట్టే 2014ఎన్నికల్లో ఆత్మకూరు అసెంబ్లీ పరిధిలో వచ్చిన మెజార్టీతోనే మేకపాటి ఎంపీగా గెలవగలిగాడు. అక్కడ తెలుగుదేశం గట్టిపోటీ ఇచ్చుంటే మేకపాటి అప్పుడే జెండా ఎత్తేసేవాడు. ఇప్పుడు ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి రూపంలో, నెల్లూరు రూరల్‌లో ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూపంలో తెలుగుదేశంకు బలమైన నాయకత్వమే వుంది. ఇక తెలుగుదేశం తరపున వీరిద్దరిలోనే ఒకరు అభ్యర్థి కావచ్చు. అంతేకాకుండా ఈరోజు తెలుగుదేశంపార్టీకి ఎన్నికల్లో ఖర్చుకు డబ్బుల కొరత లేదు. ఇక అధికార యంత్రాంగం, పోలీస్ సహకారం ఎలాగూ వుంటుంది. అదే సమయంలో మేకపాటి పట్ల ప్రజాదరణ వుందా... అంటే అదీ లేదు. ఎప్పటికప్పుడు ఆయన మీద వ్యతిరేకత పెరుగుతూనే వుంది. 2009 ఎన్నికల్లో 60వేలతో గెలిచిన ఆయన, 2012లో జరిగిన ఉపఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా దాదాపు 3లక్షల మెజార్టీతో గెలిచాడు. 2014ఎన్నికలొచ్చేసరికి ఆయన పట్ల వ్యతిరేకత పెరిగింది. ఆ ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ పరిధిలోని 7అసెంబ్లీకుగాను 5 అసెంబ్లీలలో వైకాపా అభ్యర్థులే గెలిచినా, ఎంపీ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలవాల్సిన మేకపాటి చచ్చీచెడి, చావుతప్పి కన్ను లొట్టపోయిన చందంగా 13వేల ఓట్ల మెజార్టీతో గెలిచాడు. ఇప్పుడుగాని రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళితే ఆ మెజార్టీ రావడం మాట అటుంచి గెలవడం సందేహమే! అందుకే రాజీనామా చేసి ఉపఎన్నికలకు పోవడం పట్ల ఆయన అయిష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# అంతా మా ఇష్టం

## • అక్రమాలకు ఆమోదం






**ముఖ్యమంత్రి చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకుని ఆయన మార్గంలోనే నడుస్తున్నాడు నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్. చంద్రబాబులాగే దండగ ఖర్చులు పెడుతున్నాడు. పుష్కరాల పేరుతో చంద్రబాబు తూక్‌మాలిష్ పనులు చేసి కోట్లు తగలేస్తే, మేయర్ కూడా రొట్టెల పండుగ పేరుతో నాసిరకం పనులు చేయించి డబ్బులు దుబారా చేశారు. ఇక చెత్త కాంట్రాక్ట్, డివైడర్ల నిర్వహణ, క్లీనింగ్ మిషన్ మరమ్మత్తులు, రిజర్వ్ స్థలాల అన్యాక్రాంతం వంటివి అన్నీ కూడా చంద్రబాబు బాటలో మేయర్ ఆచరిస్తున్నవే! నెల్లూరు నగరపాలక సంస్థను ఓ రకంగా ఆయన వ్యాపారసంస్థగా మలచుకున్నాడనే చెప్పొచ్చు.**

గతంలో ఎన్నో అన్యాయమైన పాలకవర్గాలున్నాయి కాని, ఇంత దారుణమైన పాలకవర్గం ఎప్పుడూ లేదు. గతంలో ఏ పాలకవర్గం హయాంలో కూడా కౌన్సిల్ సమావేశాలు ఏడాదికి ఒకసారి నిర్వహించిన దాఖలాలులేవు. కాని అజీజ్ మేయర్‌గా వచ్చాకే ఏడాది కాలం తర్వాత కౌన్సిల్ సమావేశం నిర్వహించిన సంఘటన ఇప్పుడే చోటుచేసుకుంది. అక్టోబర్ 28వ తేదీన నెల్లూరు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాన్ని అత్యంత పటిష్ట బందోబస్తు మధ్య, మీడియాను కూడా

(మిగతా 11వ పేజీలో)



# నెల్లూరు కబుర్లు

## చురుగ్గా 'దేశం' పట్టభద్రుల నమోదు!

వచ్చే ఏడాది మొదట్లోనే జరుగనున్న పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలపై జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దఎత్తునే కసరత్తు చేస్తున్నారు. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు కలిసిన ఈ నియోజకవర్గం నుండి మంత్రి నారాయణ అనుచరుడైన వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అభ్యర్థిగా ఉంటాడనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ శాసనమండలిని ఎలాగైనా చేజిక్కించుకోవాలని ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందులో కీలకమైన పట్టభద్రుల ఓట్ల నమోదులో చురుకుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ అనుబంధ సంఘాలైన తెలుగునాడు విద్యార్థి సంఘం, ఉపాధ్యాయ సంఘాలను పూర్తిగా రంగంలోకి దించారు. తెలుగుదేశంకు మద్దతుదారులైన పట్టభద్రులను ఓటర్లుగా దగ్గరుండి నమోదు చేయిస్తున్నారు. ఇందుకోసం మూడు జిల్లాల్లోనూ మండలాల వారీగా కొందరికి బాధ్యతలు అప్పగించారు. అర్థికంగా కూడా ఓట్ల నమోదుకు ప్రోత్సాహకాలు ప్రకటించారని, అందుకే ఓట్ల నమోదులో వాళ్లు ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలుస్తోంది.

## ఎస్ఆర్కెలో సాంప్రదాయ దీపావళి



నెల్లూరులోని మాగుంట లే అవుట్ మరియు ఇస్కాన్ సిటీలో వున్న డాక్టర్ ఎస్ఆర్కె స్కూల్, ఎస్ఆర్కె నెక్స్ట్ జనరేషన్ స్కూళ్లలో సాంప్రదాయ బద్ధంగా దీపావళి వేడుకలను నిర్వహించారు. ప్రకృతి సిద్ధమైన మట్టి ప్రమిదలతో విద్యార్థినులు వివిధ ఆకృతులతో దీపాలను అలంకరించారు. స్కూల్ డైరెక్టర్ పి.దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. రసాయనాలతో కూడిన విదేశీ టపాకాయలకు ప్రజలు దూరంగా ఉండాలని, దీపావళి వేడుకలను మన సాంప్రదాయ పద్ధతుల్లోనే జరుపుకోవాలని ఈ సందర్భంగా దిలీప్ పిలుపునిచ్చారు.

## ఇస్కాన్‌లో గోవర్ధనపూజ



నెల్లూరు, గొలగమూడిరోడ్డులోని ఇస్కాన్ మందిరంలో దీపావళి పర్వదిన వేడుకలను మందిర ప్రతినిధి డాక్టర్ శుకదేవస్వామి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోవర్ధనపూజ, అభిషేకం, ఆరతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ శుకదేవస్వామి ఆధ్యాత్మిక ప్రసంగంలో కృష్ణతత్వాన్ని, గోపూజ మహిమను వివరించారు.

## మీనాక్షి పవర్‌ప్రాజెక్ట్‌లో సింహపురి వైద్యం




నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నంలోని మీనాక్షి ఎనర్జీ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో వృత్తిపరమైన ఆరోగ్య కేంద్రాన్ని పూజలు నిర్వహించి లాంఛనంగా ప్రారంభించినట్లు హాస్పిటల్స్ ఛైర్మెన్ కాటంరెడ్డి రవీంద్రరెడ్డి తెలిపారు. పవర్ ప్రాజెక్ట్ నిబంధనల ప్రకారం ఉద్యోగుల అత్యవసర వైద్యసేవలు నిమిత్తం ఆక్యుపేషనల్ హెల్త్ సెంటర్ ఉండాలని, ప్రాజెక్ట్ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపిన అనంతరం సింహపురి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రంలో 24గంటలు వైద్యులు, పారామెడికల్ సిబ్బందితో అత్యవసరవైద్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. హాస్పిటల్స్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ సునీల్, డా॥ నవీన్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐల బదిలీలు

జిల్లాలో నలుగురు ఎస్ఐలకు స్థాన చలనం కలిగింది. నెల్లూరు ఐదో నగర ఎస్ఐ జగత్‌సింగ్‌ను వింజమూరుకు, వాకాడు ఎస్ఐ సుధాకర్‌ను గూడూరు వన్‌టౌన్‌కు, వింజమూరులో వున్న వెంకటరెడ్డిని వాకాడుకు, వాసును కావలి టూటౌన్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ విశాల్‌గున్నీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# కార్తీకమాసంలో శివదీక్షలకు శ్రీకారం



శివదీక్షను స్వీకరిస్తున్న ఆలూరు గిరీష్‌రెడ్డి

నెల్లూరు మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మెన్ ఆలూరు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో వరుసగా మూడో సంవత్సరం శివదీక్షలు ప్రారంభమయ్యాయి. కార్తీక మాసం ప్రారంభంరోజునే భక్తులు శివదీక్ష చేపట్టి, ఈ మాసం చివరి రోజున ముగిస్తారు. శివదీక్ష బూనిన భక్తులకు వస్త్రాలు, మాలలు, ప్రతిరోజూ అల్పాహారాన్ని గిరీష్‌కుమార్‌రెడ్డే ఏర్పాటు చేస్తుంటారు. సోమవారం కూడా కార్తీకమాసం ప్రారంభోత్సవం సందర్భంగా మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో శివదీక్షలను ప్రారంభించారు. శివదీక్ష భక్తులకు వస్త్రాలు, మాలలు అందజేశారు. ఈ నెల 29వ తేదీ వరకు శివదీక్షలుంటాయని, భక్తులు ఎప్పుడు వచ్చినా వస్త్రాలు, మాలలు అందజేస్తామని, అల్పాహారం అందిస్తామని ఈ సందర్భంగా ఆలూరు గిరీష్‌రెడ్డి తెలిపారు. ప్రతిరోజూ ఆలయంలో శివ భజనతో పాటు, కార్తీకమాసం చివరి ఏడు రోజులు శివసప్తాహం, భజనలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.వి.రామిరెడ్డి, ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ధర్మరాజుల గుడి ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం ఛైర్మెన్ మెట్టు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ విజేత పావని




బంపర్‌డ్రా విజేతను ప్రకటిస్తున్న జేసి ఇంతియాజ్ అహ్మద్

నెల్లూరులోని చందన బ్రదర్స్, సిఎంఆర్ క్లాత్ షోరూంలో దసరా, దీపావళిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన 5వ వారం బంపర్‌డ్రాను జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ సోమవారం రాత్రి తీశారు. బంపర్ డ్రాలో టాటా టయోగో కారును పావని గెలుచుకున్నారు. స్కూటీని సిహెచ్.వి నిత్య, రిఫ్రిజిరేటర్‌ను పద్మ గెలుచుకున్నారు. రెండు గ్రైండర్లను సింధు, పావని, మూడు రైస్‌కుక్కర్లను ఫణీంద్రసాయి, సౌజన్య, ఎస్.మల్లిఖార్జున గెలుచుకున్నారు. షోరూం అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, మేనేజర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

## యస్‌విఆర్ స్కూలు విద్యార్థుల వితరణ



నెల్లూరుజిల్లాలో పల్స్ పోలియో వినియోగం కోసం నెల్లూరు జాకీర్ హుస్సేన్ నగర్‌లోని యస్‌విఆర్ స్కూలు విద్యార్థులు రూ.55వేలు వితరణ చేశారు. ఇటీవల నెల్లూరు యప్‌పార్క్ హోటల్‌లో రోటరీక్లబ్ నెల్లూరుసౌత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ సందర్భంగా రోటరీక్లబ్ జిల్లా గవర్నర్ కె.శ్రీరామ్‌మూర్తి యస్‌విఆర్ స్కూలు కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు సేవల్ని కొనియాడారు. నెల్లూరు సౌత్ రోటరీ అధ్యక్షుడు డా॥ ఎన్.నారాయణరెడ్డి, కార్యదర్శి బి.సురేష్‌బాబు, వొమ్మిన నాగసతీష్, రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## 11 నుంచి మనగుడి

తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్, హిందూ ధర్మ ప్రచార పరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11 నుండి 14వ తేదీ వరకు 'మనగుడి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హిందూధర్మ ప్రచార పరిషత్ అధ్యక్షుడు సి.వి.సుబ్రహ్మణ్యం, హిందూధర్మ పరిరక్షణ ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ కోట సునీల్‌కుమార్, హిందూధర్మ ప్రచార పరిషత్ కో-ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి తెలిపారు. సోమవారం నెల్లూరు దర్గామిట్టలోని టిటిడి కళ్యాణ మండపంలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలోని 46 మండలాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. 11న 10దేవాలయాల్లో, 12న ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని 10దేవాలయాల్లో, 13, 14తేదీల్లో 460 ఆలయాల్లో సాంస్కృతిక విశేషపూజలు నిర్వహించి భక్తులకు కంకణాలు, కలకండ, పుస్తకం, ప్రసాదం అందజేస్తామన్నారు. కొండా శేఖర్‌రెడ్డి, వి.ధనుంజయ, నాగార్జునాచారి, గిరిజాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జ్ ఇడిగా కోటేశ్వరరావు

ఆర్టీసీ నెల్లూరు జోన్(నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు) ఇన్‌ఛార్జ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎ.కోటేశ్వరరావును నియమించారు. గత నెల 31న ఇ.డిగా వున్న రవీంద్రబాబు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో తాత్కాలికంగా కోటేశ్వరరావును పెదుతూ ఆర్టీసీ ఎం.డి సాంబశివరావు ఉత్తర్వులు జారీ చేశారు. కోటేశ్వరరావు గతంలో నెల్లూరు ఆర్టీసీలో గూడూరు డిపోఎంగాను, డిప్యూటీ సీటీఎంగాను, ఆర్ఎంగాను, ఇన్‌ఛార్జ్ ఇ.డిగానూ పనిచేసి వున్నారు. ప్రస్తుతం విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో ఇడిగా పనిచేస్తున్నారు.

## వైసిపి కార్పొరేటర్ల అరెస్ట్

నెల్లూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో జరిగిన రచ్చ, ఆస్తుల విధ్వంసం, తెలుగుదేశం కార్పొరేటర్ ప్రశాంతి కిరణ్‌పై దాడికి సంబంధించిన కేసులో నెల్లూరు నాలుగో నగర పోలీసులు వైకాపా కార్పొరేటర్లు దేవరకొండ అశోక్, గోగుల నాగరాజులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు.

## నెల్లూరు బాలాజీనగర్ సిఐ సస్పెండ్

నెల్లూరు బాలాజీనగర్ పోలీస్ స్టేషన్‌లో సిఐగా పనిచేస్తున్న కె.సి.హెచ్.రామారావును సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజి కార్యాలయం నుంచి ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయి. బాలాజీనగర్‌లో సిఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఆయనపై అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది నిందితుల వద్ద లక్షల్లో నగదు తీసుకున్నట్లు ఆరోపణలు వున్నాయి.

వ్యభిచారం కేసులో ఓ టివి ఛానల్ ప్రతినిధి అరెస్ట్ విషయంలో, తాజాగా ఈ మధ్య వైద్యవిద్యార్థిని లైంగికంగా వేధించిన కేసులో కానిస్టేబుల్ అరెస్ట్ విషయంలో వారి వద్ద భారీగా ముడుపులు తీసుకుని కేసులను నీరుగారుస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిఐను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

## అంతరిక్ష రికార్డుకు...

# ఇస్రో సన్నాహం!

**అంతరిక్ష ప్రయోగాలలో అగ్రరాజ్యాలతో పోటీపడుతూ, ఆ దేశాలతో పోలిస్తే అతి తక్కువ ఖర్చుతో గ్రహాల మీదకు ఉపగ్రహాలను పంపిస్తున్న భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) మరో అంతర్జాతీయ అంతరిక్ష రికార్డుకు సిద్ధమవుతోంది.**

ప్రపంచంలోనే ఇంతవరకు ఏ దేశం ప్రయోగించని విధంగా ఒకే రాకెట్ ప్రయోగం ద్వారా 83 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇస్రోకు ఎంతో నమ్మకమైన పిఎస్ఎల్వి ద్వారానే ఈ ప్రయోగం నిర్వహించబోతున్నారు. వచ్చే జనవరిలోనే ఈ ప్రయోగం ఉండొచ్చు. ఈమేరకు ఇస్రో శాస్త్రవేత్తలు పనుల్లో పూర్తిగా మునిగిపోయారు. 83 ఉపగ్రహాలలో రెండు మన దేశానికి చెందినవి కాగా, 81ఉపగ్రహాలు విదేశాలకు చెందినవి. వీటి ప్రయోగం ద్వారా 500కోట్లకుపైగా ఆదాయం రావచ్చు. ఈమేరకు ఇస్రో వాణిజ్య విభాగమైన యాంత్రిక్స్ ఆయా దేశాలతో ఒప్పందం చేసుకుంది. ఈ ఉపగ్రహాలలో యుఎస్‌వి 60 కాగా, యూరప్‌వి 20 ఉన్నాయి. ఒకటి యుకెది.

ఒకే రాకెట్‌లో 83 ఉపగ్రహాలు



ఇంత వరకు అత్యధిక ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టిన జాబితాలో రష్యా 2014జూన్‌లో 37 ఉపగ్రహాలను, 2013 నవంబర్‌లో యుఎస్ 19 ఉపగ్రహాలను, 2016 జూన్‌లో ఇండియా 20 ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపాయి. ఒకేసారి 83ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపడం అనేది మన సాహస ప్రయోగమే! ఇది సక్సెస్ అయితే ఇస్రో ఖ్యాతి మరింతగా ఇనుమడిస్తుంది.

# దేశ సమైక్యత ఆయన పుణ్యమే!

## ఉక్కుమనిషికి నివాళులు





ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 141వ జయంతిని సోమవారం నెల్లూరు నగరంలో ఘనంగా నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, జేసి-2 రాజ్‌కుమార్‌లు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ విశాల్‌గున్నీ, ఏఎస్పీలు బి.శరత్‌బాబు, కె.సూరిబాబు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రీయ ఏక్తా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ రక్షణ కోసం అంకితభావంతో పనిచేసి శాంతి భద్రతలను పరిరక్షించి ప్రజలకు మెరుగైన పరిపాలన అందిస్తామని ఎస్పీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డిఎస్పీలు కోటారెడ్డి, వెంకటరాముడు, చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరుజిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో పటేల్ చిత్రపటానికి జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డి పూలమాల వేసి నివాళుర్పించారు. ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు దర్గామిట్టలోని సర్దార్‌వల్లభాయ్ పటేల్ విగ్రహానికి నగర మేయర్ అబ్దుల్ అజీజ్, టిడిపి కార్పొరేటర్లు మన్నెం పెంచలయ్య, రాజానాయుడు, మేకల రజిని తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులు పటేల్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ వరకు జయంతి వారోత్సవాలు జరపాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వల్లభాయ్‌పటేల్ 141వ జయంతిని నెల్లూరు ఆదిత్య డిగ్రీ కళాశాల సెమినార్‌హాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎపి రైతు సంఘాల ప్రధానకార్యదర్శి సిఎస్ఆర్ కోటిరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సర్దార్‌వల్లభాయ్ పటేల్ 560 సంస్థానాలను విలీనం చేశారని, వారు లేని పక్షంలో భారతదేశం 150 దేశాలుగా ఉండేదన్నారు.

నెల్లూరు కొండాయపాలెం దళితవాడ నగర పాలక ప్రాథమిక పాఠశాలలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధుల అనాదరణ - అవగాహన సభను నిర్వహించారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు డాక్టర్ సునీత, జిల్లా స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు ఇవియస్ నాయుడు, పాఠశాల హెచ్ఎం ఎం.భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బ్రిడ్జిలు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్‌దే

## - డిసిసి అధ్యక్షులు పనబాక కృష్ణయ్య



నెల్లూరుజిల్లాలో విందూరు వద్ద పంబలేరు నది మీద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం, మిట్టాత్మకూరు వద్ద కండలేరు నదిపై బ్రిడ్జి నిర్మాణం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని డిసిసి అధ్యక్షులు పనబాక కృష్ణయ్య పేర్కొన్నారు. గూడూరులో ఇటీవల ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గూడూరు రూరల్ మండలంలోని విందూరు వద్ద పంబలేరు నది మీద హైలెవల్‌బ్రిడ్జి నిర్మించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2012-13లో 3కోట్ల 15లక్షల రూపాయలు మంజూరు చేయించి అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి, కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డిల చేత శంకుస్థాపన చేయించడం జరిగిందన్నారు. అదేవిధంగా మిట్టాత్మకూరు వద్ద కండలేరు నదిమీద హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 2012-13లో 6కోట్ల 50లక్షల రూపాయలు, నెల్లూరు రామలింగాపురం దగ్గర బ్రిడ్జి నిర్మాణానికి 7కోట్ల 35లక్షల నిధులు 2013లో మంజూరు చేయించినట్లు వివరించారు. వీటి నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గూడూరు మండల నాయకులు బాబురెడ్డి, శివకోటారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సిద్దారెడ్డి, వెంకటేశ్వర్లు, రవి, గొల్లపల్లి శ్రీనివాసులు, దశరథరాజు, మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.







## ఉన్న పోర్టుకే వ్యాపారం లేదు... తెరపై

# కొత్త పోర్టుల కొట్లాట!

2009 సెప్టెంబర్‌లో హెలికాప్టర్ ప్రమాదంలో వై.యస్.రాజశేఖరరెడ్డి మరణించకపోయి వున్నా, లేక ఈ ఏడాది కేంద్రప్రభుత్వం ఏపికి ప్రత్యేకహోదా ప్రకటించి వున్నా నెల్లూరుజిల్లా ప్రగతి చరిత్ర ఇంకోరకంగా వుండేది. వైయస్సే ఉండుంటే నెల్లూరుజిల్లా ప్రగతికి పట్టపగ్గాలుండేవి కావు. ఈ జిల్లాను నూతన అభివృద్ధి పథంవైపు నడిపించిన నాయకుడాయన! ఆయనే ఉండుంటే ఇప్పటికి జిల్లా రూపురేఖలు చాలా మారివుండేవి. నెల్లూరుజిల్లాలో ఒక పోర్టుకు కాదు రెండు పెద్దపోర్టులకు సరిపడా వ్యాపారం ఉండేది.

వై.యస్ మరణం తర్వాత నెల్లూరుజిల్లాలో అభివృద్ధి పూర్తిగా మందగించిందనే చెప్పాలి. ఆ వేగం లేకుండా పోయింది. పారిశ్రామికప్రగతి కుంటుపడడంతో జిల్లాలో అన్ని రకాల వ్యాపారాల్లో పరుగు ఆగిపోయింది. ఈ కోవలోదే పోర్టు కూడా!

దేశంలోనే అతిపెద్దదిగా 41బెర్త్‌లతో కృష్ణపట్నం పోర్టును డిజైన్ చేశారు. 13 బెర్త్‌లు పూర్తి చేశారు. వై.యస్. హయాంలో మొదలైన పారిశ్రామిక వేగం అలాగే కొనసాగివుంటే ఇక్కడ పూర్తిస్థాయిలో బెర్త్‌లను కట్టాల్సి వచ్చేది. దానికి తగ్గట్లు వ్యాపారం కూడా జరిగేది. వై.యస్. మరణం తర్వాత రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల పాలనలో పారిశ్రామికాభివృద్ధి ఆగిపోయింది. ఇక తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక నెల్లూరుజిల్లా అభివృద్ధిపై సీతకన్నేయడం తెలిసిందే! కొత్తగా ఒక్కటంటే ఒక్క పరిశ్రమ వచ్చిన దాఖలాలు లేవు. దీనికితోడు విద్యుత్ ఉత్పాదనలో సంక్షోభం వలన పలు విద్యుత్ కేంద్రాలు మూతపడే పరిస్థితి. ఇక ఐరన్‌ఓర్ దిగుమతి లేదు. కృష్ణపట్నం పోర్టుకే వ్యాపారం లేదు.

ఇలాంటి సమయంలో రామాయపట్నంలో పోర్టు కావాలంటూ వంటేరు వేణుగోపాలరెడ్డి, దుగరాజపట్నంలో పోర్టు కావాలంటూ చింతా మోహన్‌లు పోరాటాలు చేస్తామంటున్నారు. పరిశ్రమలు, ఎగుమతి, దిగుమతులకు సరైన అవకాశాలు, తగిన వ్యాపారం లేనప్పుడు పోర్టులు కట్టుకుని ఏం లాభం?

## కాలనీల అభివృద్ధి...

# కమిటీలతో సాధ్యం

## - రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



ఈ నెల 1న నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 17 మరియు 18వ డివిజన్లలోని సాయినగర్, జగదీష్‌నగర్, హరనాథపురం, పీపుల్స్ పార్క్ ప్రాంతాల్లో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రజాబాట నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నగర కార్పొరేషన్ పరిధిలో రూరల్ నియోజకవర్గంలో నూతనంగా అనేక కాలనీలు అత్యంత వేగవంతంగా విస్తరిస్తున్నాయని, జిల్లా నలుమూలల నుంచి నెల్లూరుకి వచ్చి, స్థిరనివాసం ఏర్పరచుకునే ప్రజలందరూ ఈ కాలనీల్లో నివసిస్తున్నారని, ఇటువంటి కాలనీలు అభివృద్ధి చెందాలంటే, నగర కార్పొరేషన్ ఈ కాలనీలపై ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. అదేవిధంగా స్థానిక ప్రజలు కూడా రాజకీయపార్టీలకు అతీతంగా అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, అప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నెల్లూరు నగరంలో రామ్మూర్తినగర్ అభివృద్ధి కమిటి అద్భుతంగా పనిచేస్తుందని, ఎన్నో అద్భుతాలు రామ్మూర్తినగర్ అభివృద్ధి కమిటి సాధించిందని, నెల్లూరు నగరంలో ప్రతి కాలనీ కూడా రామ్మూర్తినగర్ తరహాలో అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఎక్కడికక్కడ స్థానిక ప్రజలు అభివృద్ధి కమిటీగా ఏర్పడి, అభివృద్ధిలో స్థానిక ప్రజలు భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, రాము, సురేష్, వెంకటరామిరెడ్డి, కామేష్ రెడ్డి, శరత్, భాస్కర్‌రెడ్డి, రామరాజు, సుబ్రహ్మణ్యం, కొల్లి పవన్‌కుమార్‌రెడ్డి, పెనాక ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## గూడూరు డివిజన్ వార్తలు

### సంక్షేమ పథకాలు
# ప్రజలకు వివరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పక్కన పరిశీలకుడు నాగేశ్వరరావు, దేవసేన తదితరులు

గూడూరు పట్టణంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఇటీవల నిర్వహించారు. తొలుత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్.టి.రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గుండుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజలకు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమగ్రంగా తెలియజేయాలని అన్నారు. జనచైతన్య యాత్రలను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు దేశం హయాంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల తీరు, గత ప్రభుత్వంలో ప్రజలు పడిన కష్టాలను చైతన్యయాత్రలో వివరించాలన్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ త్వరలో జరిగే పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ ఘనవిజయం సాధించేలా అర్హులైన వారిని ఓటర్లుగా చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన ట్రస్టు ఛైర్మెన్ తానంకి నానాజీ, నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, జ్యోత్స్నలత, శీలం కిరణ్‌కుమార్, బొల్లినేని కోటేశ్వరరావు, పత్రి జనార్ధన్, పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కరరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, వేణునాయుడు, కోటారెడ్డి, మధురెడ్డి, రమాదేవి, చెంచు రామయ్య, కిషోర్‌నాయుడు, భారతి, జన్మభూమి కమిటి సభ్యులు, నియోజకవర్గ వివిధ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఏపిజె అబ్దుల్‌కలాం ట్రస్టు ఆధ్వర్యంలో
# విద్యార్థికి నగదు పంపిణి



పావనికి చెక్కును అందజేస్తున్న సురేష్‌రెడ్డి తదితరులు

గూడూరు పట్టణంలోని స్వర్ణాంధ్ర భారతి కళాశాల విద్యార్థిని కీర్తిపాటి పావనికి రూ.10వేలను ఏపిజె అబ్దుల్ కలాం ట్రస్టు ప్రతినిధి సురేష్‌రెడ్డి సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ ట్రస్టు ప్రతినిధులు ఎస్.డి.తాజుద్దీన్, కాలేషా, కౌన్సిలర్ ఇజ్రాయల్‌కుమార్, బి.రవికుమార్, సభ్యులు అల్తాఫ్, కరిముల్లా, సందాని బాషా, భార్గవ్, యోగి, లక్ష్మిరెడ్డి, చాన్‌బాషా, శ్రీధర్‌రెడ్డి, రమేష్, కిషోర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు



ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాజీప్రధాని ఇందిరాగాంధీ దేశంలోని పేద కుటుంబాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని పీసీసీ ప్రతినిధి కె.మునిగిరీష్ తెలిపారు.

గూడూరు పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలలో ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు, ఇతర వస్తువులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరబోయిన గోపాలకృష్ణయాదవ్, రవీంద్రరెడ్డి, ముర్తుజా, జిలానీ, జహంగీర్, సురేంద్ర, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్‌టిలో 'సరఫరా'దే ప్రాధాన్యత

**జిఎస్‌టిపై పరిశీలన-4**

పరోక్ష పన్నుల విధానంలో విప్లవాత్మకమైన సంస్కరణగా వస్తు సేవా పన్నుల విధానం ప్రవేశపెట్టడం జరిగింది. ఒక వస్తువు తయారుకాగానే కర్మాగారము నుండి విడుదలకు ముందుగానే ఎక్సైజ్ సుంకాన్ని విధించడం జరుగుతుంది. అమ్మకాలు ప్రారంభం నుంచే వ్యాట్ మరియు సిఎస్‌టి పన్నులను విధిస్తారు. వీటన్నిటికీ బదులుగా జిఎస్‌టిని రూపొందించడం జరిగింది.

వస్తు సేవా పన్ను విధానంలో తయారీ, అమ్మకం, సేవలతో సంబంధం లేకుండా సరఫరాపై పన్ను విధించడమే నూతన ప్రక్రియ.

సరఫరా పరిధి చాలా పెద్దది. జిఎస్‌టిని రూపొందించడానికి రాజ్యాంగ సవరణలు చేసినప్పటికీ సరఫరాకు తగిన వివరణ ఇవ్వలేదు.

జిఎస్‌టిలో ఒక వస్తువు తయారుచేసినప్పటినుంచి వివిధ సమయాలలో జరిగే విలువ ఆధారంగా పన్ను విధించడం జరుగుతుంది. ఇది 'వినియోగ ఆధారిత పన్ను' కనుక ప్రతి దశలో చెల్లించిన పన్ను (ఇన్‌పుట్ టాక్స్) క్రింది, తరువాత దశ వారు తాము చెల్లించే పన్నులో తగ్గించుకుని మిగతా పన్ను మాత్రమే చెల్లించాల్సివస్తుంది. అలా చివరకు వినియోగదారుడు పూర్తి పన్ను చెల్లించడం జరుగుతుంది. జిఎస్‌టి చట్టంలోని సెక్షన్-3 ప్రకారం ఈ క్రింద పేర్కొన్న అంశాలు 'సరఫరా' పరిధిలోకి వస్తాయి.



**చిన్ని శ్రావణ్‌కుమార్**
చార్టర్డ్ అకౌంటెంట్
e-mail: chinnisravankumar@gmail.com

ఎ) వ్యాపార నిమిత్తం కొంత విలువకు జరిగే అన్ని రకాల అమ్మకం, బదిలీ, మార్చుకొనుట, మార్పిడి

బి) వ్యాపార నిమిత్తం అయినా కాకపోయినా ప్రతిఫలానికి జరిగినా, జరగకపోయినా దిగుమతి చేసుకునే సేవలు

ఇంకా

సి) ప్రతిఫలం లేనప్పటికీ జిఎస్‌టి చట్టంలోని షెడ్యూల్-1లో పేర్కొన్నవి.

సెక్షన్ 3 (2) జిఎస్‌టి చట్టంలోని షెడ్యూలు-2 ప్రకారం ఏఏ కార్యకలాపాలు సేవల కిందకు వస్తాయి లేక ఏఏ కార్యకలాపాలు వస్తువుల సరఫరా కిందికి వస్తాయో నిర్వచించడం జరిగింది.

సెక్షన్ 3 (2ఏ) ప్రకారం :

ఏ వ్యక్తి అయినా కమీషన్ లేక బ్రోకరేజ్ కోసం మరొకరి ప్రతినిధి (ఏజెంట్)గా వ్యవహరిస్తూ ప్రిన్సిపల్ కోసం వస్తు సేవలను సరఫరా లేక అందుకోవడం జరుపుతుంటే, ఆ ప్రిన్స్‌పల్‌కి మరియు ప్రతినిధికి మధ్య జరిగే సరఫరాని సరఫరా జరిగినట్లు (డీమ్డ్ సప్లయ్) అని అంటారు.

సెక్షన్ 3 (3) (2) ప్రకారం కౌన్సిల్ సిఫారసులతో కేంద్రం లేక రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనల ద్వారా ఈ క్రింది కార్యకలాపాలను కూడా సరఫరా పరిధిలోనికి తీసుకురావచ్చును.

1) సరఫరా చేసేది వస్తువులు కానీ సేవలు కాదు

2) సరఫరా చేసేవి సేవలు కాని వస్తువులు కాదు

3) సరఫరా జరిగేవి సేవలు కాదు మరియు వస్తువులు కూడా కాదు

సెక్షన్ 3 (4) ప్రకారం సెక్షన్ 3 (1)లో ఏమని వున్నను సెక్షన్ 43-బి లో నిర్వచించిన విధంగా బ్రాండ్ లేక వ్యాపార పేరు కలిగివుండి మొత్తం (అగ్రిగేటర్) చేసే బ్రాండెడ్ సేవలను కూడా సరఫరా పరిధిలోనికి తీసుకురావడం జరిగింది.

జిఎస్‌టిలో సరఫరాకు ఈ క్రింద పేర్కొన్న అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సివుంటుంది.

ఎ) జరిగిన లేక జరిగే సరఫరా సేవలు లేక వస్తువులు

బి) సరఫరా - ప్రతిఫలానికి

సి) వ్యాపారం కోసం జరిగే సరఫరా

డి) సరఫరా పన్ను కట్టవలసిన ప్రదేశం

ఇ) సరఫరా పన్ను కట్టవలసినవి

ఎఫ్) సరఫరా పన్ను కట్టవలసిన వ్యక్తి

పై అంశాల్లో అన్నీ లేక కొన్ని లేకున్నా జిఎస్‌టి పరిధిలోకి వస్తాయి.

ఉదా : మనం చేసే ఉచిత మొబైల్ రీ-చార్జి వ్యాపారం కొనసాగించడం కోసం ఈ లావాదేవీపై పన్ను వేయడం జరుగుతుంది.

కొన్నిసార్లు పైన పేర్కొన్న అన్ని అంశాలు ఉన్నప్పటికీ చేసే లావాదేవీలు జిఎస్‌టి పరిధిలోనికి రావు.

ఉదా : ఒక ఉద్యోగి యజమానికి సేవలు చేయడంలో పైన పేర్కొన్న అన్ని అంశాలు ఉన్నప్పటికీ జిఎస్‌టి వర్తించదు.

(ఎ) సరఫరా జరిగేది వస్తువులా లేక సేవలా?

సరఫరా జరిగేది వస్తువులా లేక సేవలా అనేది నిర్ధారించాల్సివుంటుంది. ఒక లావాదేవీలో పలు రకాల అంశాలు, సరఫరాలు కలిగివుంటాయి. ఒక సరఫరా ఎక్కువ పన్ను పరిధిలోకి రావచ్చు, లేక ఒక సరఫరాకి పన్ను మినహాయింపు ఇవ్వవచ్చు, మరియు సరఫరా చేసే ప్రదేశం, సమయం సేవలకి, వస్తు సరఫరాలకి, వేరు వేరుగా వుంటాయి కనుక వస్తు సేవలను గుర్తించడం తప్పనిసరి.

వస్తు సరఫరాని జిఎస్‌టి చట్టంలో నిర్వచించలేదు. వాడుకలో వస్తు సరఫరా అనగా వస్తువును బదిలీ చేయుటకు అర్హత కలిగివుండుట.

వస్తు బదిలీని ఈ క్రింద పేర్కొన్న అంశాలు ప్రభావితం చేస్తాయి.

ఏ) వస్తువు మరియు హక్కు బదిలీ చేయడం

ఉదా : మనం వస్తువును కొనుగోలు చేయడం జరిగితే మనకు వస్తువు మరియు హక్కు బదిలీ అవుతుంది.

బి) హక్కును కాకుండా వస్తువును బదిలీ చేయుట

సి) వస్తువును బదిలీ చేయుట హక్కును వుంచుకొనుట

ఉదా : పెళ్ళిళ్ళకు అద్దెకు తీసుకునే వస్తువులు వాడుకొనుటకు అర్హత వుంటుంది. కానీ అవి అమ్మటానికి హక్కు వుండదు.

జిఎస్‌టి చట్టంలో సేవలు సరఫరాని నిర్వచించలేదు. ప్రపంచవ్యాప్తంగా సేవల సరఫరా అనగా వస్తు సరఫరా కానిది అని అర్థం.

ఒక వ్యక్తి పారితోషికం కోసం సేవ (పని) చేయుటకు కాని, చేయడానికి అంగీకరించడం సేవల సరఫరా అవుతుంది. ఇది కాకుండా ఒకవ్యక్తిని అతడు చేయదలచుకున్న పనిని ధనము ఇచ్చి సేవ చేయకుండా ఆపడం కూడా సేవే అవుతుంది.

ఉదా : ఎక్స్ అనే వ్యక్తి ఏబిసి పార్టీలో నుంచి ఎంఎన్‌సి అనే పార్టీలోకి మారాలనుకుంటే పిబిఆర్ పార్టీవారు ఎక్స్‌కి కొంత ధనము ఇచ్చి ఎంఎన్‌సి పార్టీలో చేరకుండా ఆపగలిగితే అదికూడా సేవ కిందకి వస్తుంది.

2) సరఫరా ప్రతిఫలం కోసం చేసేదిగా వుండాలి.

సరఫరాలోని ఒక ముఖ్యమైన అంశం ప్రతిఫలం కోసం జరిపితేనే జిఎస్‌టి పరిధిలోకి వస్తుంది. ప్రతిఫలం ధనరూపేణా వుండాల్సిన అవసరం లేదు. ఏ రూపంలో అందినా సరిపోతుంది. ప్రతిఫలం నేరుగా ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి కానీ లేక మరో వ్యక్తిద్వారా అందించినా సరిపోతుంది.

(మిగతా వచ్చేవారం)



మంగళవారం గూడూరులో జరిగిన టిడిపి జనచైతన్య యాత్రలో పాల్గొన్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, పెంచలకోన ట్రస్టు ఛైర్మెన్ తానంకి నానాజీ, జ్యోత్స్నలత, వైస్ ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, డిఎస్పీ శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు తదితరులు



ఇటీవల నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మొట్టమొదటి టిడిపి జిల్లా అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావును సన్మానిస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టి.రమేష్‌రెడ్డి, మేయర్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, శ్రీధరకృష్ణారెడ్డి, ఉచ్చి భువనేశ్వరప్రసాద్ తదితరులు



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 4.11.2016 నుండి**
**తేది. 10.11.2016 వరకు**

ఈ వారం సింహంలో రాహువు, కన్యలో గురువు, తులలో రవి, వృశ్చికంలో శనిబుధులు, ధనుస్సులో శుక్రుడు, మకరంలో కుజుడు, కుంభంలో కేతువు, ధనుర్మకరకుంభ మీన రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**
తేది 7 సోమవారము కోటి సోమవారము.

**ముహూర్తములు:**
తేది 6 ఆదివారము ఉదయము గంట 9.20 నుండి గంట 11.26లోగా ధనుర్లగ్నమున వ్యాపార వివాహ ఉపనయనములు.
తేది 9 బుధవారము ఉదయం గంట 9.10 నుండి గంట 11.16లోగా ధనుర్లగ్నమున ఉపనయన వ్యాపార వివాహములు.

**కార్తీక మాస శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 4 | శుక్ర | పంచమి | పూర్తిగ |
| తేది. 5 | శని | పంచమి | ఉ॥ గం.6.33వ॥ |
| తేది. 6 | ఆది | షష్ఠి | ఉ॥ గం.7.26వ॥ |
| తేది. 7 | సోమ | సప్తమి | ఉ॥ గం.7.46వ॥ |
| తేది. 8 | మంగళ | అష్టమి | ఉ॥ గం.7.37వ॥ |
| తేది. 9 | బుధ | నవమి | ఉ॥ గం.6.55వ॥ |
| | పిదప | దశమి | రా॥ గం.5.57వ॥ |
| తేది. 10 | గురు | ఏకాదశి | రా॥ గం.4.55వ॥ |

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

యజమానులకు వర్కర్లతో ఇబ్బందులుంటాయి. షేర్లు, పెట్టుబడులు నిరుత్సాహం కలిగిస్తాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ పెట్టండి. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం, ఆర్థికావకాశాలు తగ్గిపోవడం ఉంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. వస్తువులు, డబ్బు జాగ్రత్త పెట్టుకొనండి. ఆదాయం కంటే ఖర్చులే అధికంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరం.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

బంధుమిత్రుల రాకపోకలు, మీకు సహాయపడడం జరుగుతుంది. శుభవార్తలు వింటారు. దైవ కార్యాలలో పాల్గొంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ఆలస్యం కాగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించండి. విద్యా ప్రగతి బాగుంటుంది. చేసే కృషికి తగ్గట్లుగా ఆర్థికస్థితి ఉండదు. ఖర్చులు బాగా పెరిగిపోతాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కోర్టు వ్యవహారాలలో అనుకూలత, రావలసిన బాకీలు కొంత వరకు లభించడం జరుగుతుంది. వస్తు వాహన గృహ రిపేర్ల ఖర్చులుంటాయి. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి. కుటుంబసౌఖ్యం, విద్యార్థులకు విద్యావృద్ధి ఉంటుంది. వ్యవహారాలలో నిర్ణయాలను, ఆర్థిక వ్యవహారాలను సమర్ధవంతంగా జరుపుతారు. మాటలో తొందరపాటు లేకుండా చూచుకొనండి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

దైవకార్యాలలో పాల్గొనడం, ప్రముఖుల పరిచయాలుంటాయి. శుభవార్తలు వింటారు. షేర్లు, పెట్టుబడుల మీద లాభాలుంటాయి. ఉద్యోగులకు అధికారుల వల్ల సహచరుల వల్ల సమస్యలుంటాయి. వృత్తి వ్యాపారాలలో రాబడి కొద్దిగా పెరుగుతుంది. ఉపాధి పధకాలలో నిలద్రొక్కుకుంటారు. కళాక్రీడా శాస్త్ర వైద్య రంగాల వారికి పరిస్థితులు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ప్రముఖులతో పరిచయాలు కలుగుతాయి. ఉద్యోగులకు ప్రయోజనం కలిగే పనులు జరగడం, అధికారవర్గ అనుకూలత ఉంటుంది. ఆస్తి వ్యవహావరాలు, కోర్టు వ్యవహారాలు పరిష్కారానికి రాగలవు. శుభకార్య ప్రయత్నాలు, అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. కొత్త వస్తువులు సమకూరుతాయి. కుటుంబంలో చిన్న చిన్న విషయాల వల్ల అభిప్రాయభేదాలుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. రావలసిన బాకీలు లభించడం, స్థిరాస్తుల లావాదేవీలు జరుగగలవు. హామీలు ఇవ్వడం, రిస్క్ తీసికొనడం చేయవద్దు. ఉద్యోగార్ధులకు అవకాశాలు లభించగలవు. ఆర్థికంగా బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉంటుంది. కాని మనస్సుకు కొరతగా అనిపిస్తుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కొత్త పథకాలు ప్రణాళికలు అమలు చేస్తారు. ఆకర్షణలకు వత్తిడులకు లొంగవద్దు. దూర ప్రయాణాలుంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొనడం, పెట్టుబడులపై లాభాలుంటాయి. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. బంధువుల నుండి శుభవార్త వింటారు. ఆరోగ్యం కాపాడుకొనండి. ఆర్థికంగా పెరుగుదలకు చేసే పనులన్నీ కలిసివస్తాయి. పన్నులు, బాకీలు చెల్లిస్తారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

జీవిత సహచరులకు ఆరోగ్య లోపం ఉండవచ్చును. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. అధికారుల వల్ల ఇబ్బందులు కలుగవచ్చును. గృహ వస్తు రిపేర్లుండవచ్చును. శ్రమతో అనుకున్న పనులు జరుపుకొంటారు. ఆరోగ్యం బాగుంటుంది. కొన్ని ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలలో గాని, కుటుంబ నిర్ణయాలలోగాని పొరబాట్లు రాకుండా జాగ్రత్తపడండి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

రావలసిన బాకీలు కొంత చేతికందడం, స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగుట, దూరప్రయాణాలు తప్పని సరిగా ఉంటాయి. శుభకార్యాలు నిర్ణయం కావచ్చును. దైవ సేవలు, సభల్లో పాల్గొంటారు. కుటుంబసభ్యులకు ఆరోగ్యం సరిగా ఉండదు. కొత్త కాంట్రాక్టులు అగ్రిమెంట్లు లీజులకు అవకాశాలు రాగలవు. కుటుంబ సమస్యలను రాజీమార్గంలో సర్దుబాటు చేయగలరు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కళా క్రీడా మార్కెటింగ్ రంగాల వారికి ప్రోత్సాహకర పరిస్థితులుంటాయి. గృహోపకరణాలు విలువైన వస్తువులు చేకూరుతాయి. దైవకార్యాలలో పాల్గొనడం, సహాయ పడటం జరుగుతుంది. దూరప్రయాణాలుంటాయి. శుభవార్తలు వింటారు. స్వల్ప అనారోగ్య సమస్యలుండవచ్చును. ఉద్యోగార్ధులకు ప్రయత్నాలు ఫలించవచ్చును. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

పెట్టుబడులకు అవకాశాలు, షేర్ల మీద లాభాలుంటాయి. కొత్త వారితో పరిచయాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. స్థిరాస్తుల క్రయవిక్రయ ప్రయత్నాలు జరుగుతాయి. ప్రభుత్వ అనుమతులు లభించగలవు. ఉద్యోగ బాధ్యతలు పెరిగి విశ్రాంతి తగ్గుతుంది. ఉద్యోగార్ధులకు ఇంటర్వ్యూ అవకాశాలు లభిస్తాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. కుటుంబంలో స్వల్పంగా అపార్ధాల వల్ల సమస్యలుండి సర్దుకుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ప్రభుత్వ అనుమతుల్లో జాప్యం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. శుభవార్తలు వింటారు. బంధుముఖ్యులను ఆత్మీయులను కలుసుకొంటారు. నిరుద్యోగులకు అవకాశాలు, ఉద్యోగులకు బాధ్యతల భారం పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగిపోతాయి. క్రొత్త వ్యాపార అవకాశాలు పెట్టుబడి అవకాశాలు వాయిదా పడగలవు.

# నెల్లూరు కార్పొరేషన్ వద్ద కేంద్ర బలగాలు

శ్రీను గల్పిక

బీహార్ రెజిమెంట్ దళాన్ని ఉత్తరం వైపుగా మోహరింప చేయండి... పారా కమెండోలను తూర్పు దిక్కున మోహరించాలి... అస్సాం రైఫిల్స్‌ను ఉత్తరం దిక్కున పెట్టండి... అవసరమైతే ఇండో, టిబిటెన్ బోర్డర్ సెక్యూరిటీని కూడా దింపండి. స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను సిద్ధంగా వుంచండి. ఎలాగూ స్టేట్ నుండి అక్టోపస్, గ్రేహౌండ్స్ దళాలు రెడీగా ఉంటాయి. పరిస్థితి అదుపు తప్పిందంటే ఎయిర్‌ఫోర్స్‌ను కూడా రంగంలోకి దించుతాం... ఢిల్లీలోని తన ఛాంబర్‌లో కూర్చుని కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు ఫోన్‌లో రక్షణశాఖ మంత్రి మనోహర్ పారికర్‌కు ఇదంతా సూచిస్తున్నాడు. అప్పుడే తమ ఛాంబర్‌ల వైపు వెళుతున్న ప్రధాని నరేంద్రమోడీ, హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌లు వెంకయ్య ఛాంబర్ ముందు ఆగిపోయి వారి ఫోన్ సంభాషణంతా వింటున్నారు. వెంకయ్య మాటలకు అవతల నుండి మనోహర్ పారికర్... మీరు కోరిన విధంగా అన్ని రకాల దళాలను పంపిస్తాం. అక్కడేమన్నా బాంబుదాడులు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశముందా అని ప్రశ్నించాడు. దానికి ఫోన్‌లో వెంకయ్య... మన పెద్దోళ్లు కీడెంచి మేలెంచమన్నారు, నాకు తెలిసిన చరిత్రలో అయితే అటువంటిదేమీ లేదు. నిఘావర్గాలు కూడా అప్రమత్తంగా ఉండమన్నాయేగాని ప్రాణనష్టంపై ఎటువంటి సమాచారమివ్వలేదు. ఎందుకైనా మంచిదని చెప్పి నేనే గ్లోబెల్, బొల్లినేని, అపోలో, సింహపురి, పోర్టిస్ మలార్, విజయ వంటి ఆసుపత్రుల యాజమాన్యాలతో మాట్లాడి అంబులెన్స్‌లతో పాటూ అత్యవసర వైద్యసేవలకు తరలించేందుకు వీలుగా హెలిఅంబులెన్స్‌లను కూడా ఏర్పాటు చేయించాను. అలాగే వందమంది నిష్ణాతులైన వైద్యులను పెట్టించా, కాళ్లు చేతులు విరిగితే అప్పటికప్పుడు కట్లుకట్టడానికి వీలుగా ఆ డాక్టర్లలో సగం మందిని ఆర్థోపెడిక్ డాక్టర్లనే నియమించాను. రక్తం కొరత ఏర్పడకుండా రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు వారితో కూడా మాట్లాడిపెట్టాను అని వివరించాడు.

బయట నిలబడి వాళ్లిద్దరి సంభాషణ శ్రద్ధగా వింటున్న ప్రధాని మోడీకి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆయన హృదయం ఆనందంతో బరువెక్కిపోయింది. ఆయన గద్గద స్వరంతో పక్కనేవున్న రాజ్‌నాథ్ సింగ్‌తో... చూసారండీ... దేశం పట్ల మన వెంకయ్యనాయుడు గారి నిబద్ధత... దేశ భద్రత కోసం పడుతున్న తపన. ఇలాంటి ఆణిముత్యాలనే కదండీ ఈ దేశం కోరుకునేది. మనల్ని శ్రమపెట్టకుండానే, మనకు నొప్పి తెలియకుండా ఉండడం కోసం వెంకయ్యాజీ పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడానికి పెద్ద స్కెచ్చే వేసినట్లున్నారు. వెంకయ్య ప్లాన్ వేస్తే అది సూపర్ హిట్టే! మనం లోపలకెళ్లి ఆయనను సర్‌ప్రైజ్ చేద్దాం... పదండి అంటూ వెంకయ్య ఛాంబర్‌లోకి వెళ్లారు. వెంకయ్య వారిని చూసి లేచి నిలబడి ఆహ్వానించి తన ఎదురుగా వున్న కుర్చీల్లో కూర్చోబెట్టాడు. మోడీ వుండి... వెంకయ్యాజీ... దేశం పట్ల మీరు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు నా అభినందనలు. ఇప్పటిదాకా మీరు మాట్లాడిన సెక్యూరిటీ ఫోర్స్ అంతా సర్జికల్ స్ట్రైక్స్ కోసమేనా? మీరు, మనోహర్ పారికర్ కలిసి ఉగ్రవాదులను తుదముట్టించడానికి ఇంకో ప్లాన్ ఏమన్నా వేసారా? అని ప్రశ్నించాడు. అందుకు వెంకయ్య బదులిస్తూ... సర్జికల్ స్ట్రైక్సా పాడా... అదేదన్నా వుంటే చూసుకోవడానికి మీరున్నారుగా, ఈ సెక్యూరిటీ ఫోర్స్ అంతా కూడా మా నెల్లూరుకు సంబంధించిన విషయం. ఇంకొద్ది సేపట్లో నెల్లూరు నగరపాలకసంస్థ కౌన్సిల్ సమావేశం మొదలుకాబోతోంది. ఇండో-పాక్ బోర్డర్‌లో వున్న దానికంటే కూడా అక్కడ టెన్షన్ వాతావరణముంది. కార్పొరేటర్లు అరివీర భయంకరంగా యుద్ధం చేసుకునే అవకాశాలున్నాయి. అందుకే ముందస్తు భద్రతా ఏర్పాట్లన్నీ మనోహర్ పారికర్‌తో మాట్లాడి చేయించాను. ఈ స్టేట్ గవర్నమెంటోళ్లు ఏం చేస్తున్నారో చూడాలి... అంటూ అప్పుడే నైట్‌రైడర్, ముదురు దోమల మంత్రి పి.నారాయణకు ఫోన్ ఒత్తాడు. అవతల నారాయణ ఫోన్ ఎత్తాడు. నెల్లూరు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం వద్ద భద్రతా ఏర్పాట్ల గురించి వెంకయ్య అడిగాడు. అందుకు నారాయణ... కేంద్ర బలగాలకు తోడుగా నలుగురు ఐజిలు, 8మంది డిఐజిలు, 12మంది ఎస్పీలు, 16మంది ఏఎస్పీలు, వందమంది డిఎస్పీలను నియమించాం. ఇక సి.ఐలు, ఎస్‌ఐలైతే గుట్టలుగుట్టలుగానే వున్నారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకున్నా ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పాడు. ఓకే వెరీగుడ్ అంటూ వెంకయ్య ఫోన్ కట్ చేసాడు. ఇదంతా వింటున్న మోడీ, రాజ్‌నాథ్‌సింగ్‌లు ఆశ్చర్యపోయారు. ఒక కౌన్సిల్ సమావేశానికి ఇంత సీనా... ఏంటి ఆ కౌన్సిల్ మీటింగ్ స్పెషల్ అని మోడీ అడిగాడు. తినబోతూ రుచెందుకు... ఎలాగూ లైవ్‌లో ప్రసారం అవుతుంది చూడండి అంటూ వెంకయ్య టీవీ ఆన్ చేశాడు.

★★★★★

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌హాల్. మేయర్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షస్థానంలో కూర్చోగా, కార్పొరేటర్లు వారి వారి స్థానాల్లో కూర్చున్నారు. బయట దేశ నలుమూలల నుండి వచ్చిన భద్రతా దళాలన్నీ రెప్పవాల్చకుండా పరిస్థితిని గమనిస్తున్నాయి. ఆర్మీ హెలికాప్టర్‌లు కార్పొరేషన్ కార్యాలయంపై గస్తీ కాస్తున్నాయి. కమిషనర్ వెంకటేశ్వర్లు అజెండా చదవడం మొదలుపెట్టాడు. వైసిపి ఫ్లోర్‌లీడర్ రూప్‌కుమార్‌యాదవ్ లేచి... ఇందులో అన్నీ దోచుకునేవి, దాచుకునేవే ఉన్నాయి. ప్రజాసమస్యల గురించిన అంశాలే అజెండాలో లేవు అని అన్నాడు. దానికి మేయర్... ప్రజా సమస్యలు ఉంటే ఎప్పుడైనా చర్చించుకోవచ్చు... నెల్లూరు ప్రజలు ఎక్కడికీ పోరు. ఇక్కడే వుంటారు. కాని మనం ఈ పదవుల్లో ఉండేది ఐదేళ్లే... కాబట్టి ఈలోపు మన సమస్యలను పరిష్కరించుకుందామన్నాడు. వెంటనే వైసిపి కార్పొరేటర్ దేవరకొండ అశోక్ లేచి... మనల్ని గెలిపించింది ప్రజలు. వాళ్ల సమస్యలను పట్టించుకోకపోతే ఎట్లా? అని ప్రశ్నించాడు. దీనికి టీడీపీ వైపు నుండి ప్రశాంతి కిరణ్ లేచి... మా మేయర్ మాట్లాడుతుంటే నువ్వేంది... అడ్డు తగిలేది అంటూ అరిచాడు. అంతే ముందు బూతులు తిట్టుకున్నారు. ఆ తర్వాత ఇరు పార్టీల కార్పొరేటర్లు తన్నుకోవడం మొదలుపెట్టారు. ఒకర్నొకరు గాల్లోకి ఎగరేస్తూ... గాల్లోనే తంతూ... టేబుళ్లను తంతూ, మైకులు విరుస్తూ... హాలీవుడ్ యాక్షన్ సినిమా సన్నివేశాలు కూడా పనికి రానంతగా అక్కడ భీభత్స దృశ్యాలు చోటు చేసుకున్నాయి. గాయపడిన కార్పొరేటర్లను అప్పటికప్పుడు అంబులెన్స్‌ల్లోకి ఎక్కించి ఆసుపత్రులకు పంపిస్తున్నారు. రక్తమోడుతున్న కార్పొరేటర్లకు అక్కడే వైద్యులు మందురాసి కట్లు కడుతున్నారు.

★★★★★

ఈ దృశ్యాలను టీవీ ద్వారా లైవ్‌లో చూస్తున్న మోడీ, రాజ్‌నాథ్‌సింగ్‌లు అలాగే నోరెళ్లబెట్టారు. మన దేశంలో ఇలాంటి కార్పొరేటర్లు కూడా ఉన్నారా? వీళ్లు కార్పొరేటర్లు కాదు, జెట్‌ఫైటర్లు. మన దేశానికి దొరికిన రక్షణరత్నాలు. దేశ భద్రత కోసం వీళ్లను బోర్డర్‌లో వాడుకోవాలి. చురకత్తుల్లాంటి నెల్లూరు కార్పొరేటర్లను బోర్డర్‌లో దించితే చైనా, పాకిస్థాన్‌లు మన వైపు కన్నెత్తి చూడడానికి కూడా భయపడుతాయంటూ మోడీ అక్కడ నుండి లేచాడు.

# నెల్లూరు పాటకు జాతీయ గౌరవం

*గాన గంధర్వుడు.. ప్రఖ్యాత సినీ నేపథ్యగాయకుడు..తన అత్యద్భుతమైన గానంతో తెలుగునేలనే కాక, యావద్భారత దేశాన్ని పులకింపజేస్తున్న పాటల రేడు..సింహపురిసీమ ముద్దుబిడ్డ శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) జాతీయస్థాయిలో మరో అరుదైన, ప్రతిష్టాత్మకమైన పురస్కారం అందుకోనున్నారు.*

2016 సంవత్సరానికిగాను కేంద్రప్రభుత్వం ప్రదానం చేసే ఎంతో విశిష్టమైన భారతీయ చలనచిత్ర మూర్తిమత్వ పురస్కారం (సెంటినరీ అవార్డ్ ఫర్ ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్-2016) బాలూకి లభించింది. గోవాలో జరుగనున్న భారతీయ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫి) ఉత్సవాల్లో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ పురస్కారంతో పాటు బాలూకి 10లక్షల రూపాయల నగదు బహుమతిని కూడా అందజేస్తారు. భారతీయ చలనచిత్ర రంగంతో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యంకు వున్న అయిదు దశాబ్దాల బంధానికి గుర్తింపుగా ఈ ప్రతిష్టాత్మకమైన పురస్కారాన్ని కేంద్రప్రభుత్వం ప్రకటించిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి ఎం. వెంకయ్యనాయుడు మంగళవారం ఢిల్లీలో జరిగిన విలేకర్ల సమావేశంలో వివరించారు. అందరూ ఆప్యాయంగా బాలూ అని పిలుచుకునే ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గురించి తెలియని భారతీయుడు వుండరని, తెలుగు భాషలోనే కాక తమిళం, కన్నడ, హిందీ, మలయాళం భాషల్లో ఆయన సుమారు 40వేలకు పైగానే పాటలు పాడి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సాధించారని వెంకయ్యనాయుడు అన్నారు. 2001లో పద్మశ్రీ పురస్కారం, 2011లో పద్మభూషణ్ పురస్కారం కూడా ఆయన అందుకున్నారని, ఇంకా పలు జాతీయ అవార్డులు, లెక్కలేనన్ని రాష్ట్రస్థాయి అవార్డులు బాలూకి లభించాయని ప్రశంసించారు. తాజాగా కేంద్రప్రభుత్వం ప్రకటించిన ఈ ప్రతిష్టాత్మక అవార్డును గతంలో ప్రఖ్యాత నటి వహీదారెహమాన్, సూపర్‌స్టార్ రజనీకాంత్, విఖ్యాత సినీ సంగీత దర్శకుడు ఇళయరాజాలు అందుకున్నారని, ఇప్పుడు ఈ అవార్డు అందుకుంటున్నవారిలో బాలూ నాల్గవ వారని ఆయన అన్నారు. గోవాలో ఈ నెల 20 నుంచి 28వ తేది వరకు జరిగే భారతీయ అంతర్జాతీయ చలనచిత్రోత్సవ వేడుకల్లో బాలూ ఈ ప్రఖ్యాతమైన, ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకోనున్నారని ఆయన తెలిపారు.

కాగా, బాలూకి జాతీయస్థాయిలో ఎంతో విశిష్టమైన ఈ అవార్డు లభించడంతో ప్రత్యేకించి సింహపురిసీమవాసులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు చెందిన ఎందరో కళాకారులు, సంగీతాభిమానులు, ఆత్మీయులు బాలూకు ఈ ఘనమైన పురస్కారం లభించడం తెలుగుపాటకు, ప్రత్యేకించి నెల్లూరు పాటకు అత్యద్భుతమైన గౌరవం లభించినట్లేనని ఎంతగానో సంబరపడిపోతున్నారు.

## ఆశ్చర్యం..ఆనందం! - ఎస్పీ బాలూ



జాతీయస్థాయిలో ప్రఖ్యాతమైన ఈ పురస్కారం లభించడం నాకెంతో ఆనందంగా వుంది. పురస్కారం ప్రకటించారని తెలియగానే ఎంతో ఆశ్చర్యపోయాను.. ఆనందించాను. ఎందరో ప్రముఖులైన నిష్ణాతులు వుండగా, ఆ విశిష్టమైన అవార్డు లభించడం నా అదృష్టం. అయితే, ఈ అవార్డు నా ఒక్కడిదే కాదు. సినిమా రంగంలో, ముఖ్యంగా సంగీత ప్రపంచంలోని అందరికీ ఈ అవార్డు చెందుతుంది. జన్మనిచ్చిన నా తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల భాగస్వామ్యం లేనిదే చలనచిత్రరంగంలో 50 ఏళ్ళకు పైగా కొనసాగడం ఎంతో కష్టసాధ్యం. అన్నిటికీ మించి ఇప్పటికీ నా పాట వింటూ నన్ను ఆశీర్వదిస్తూ ఇంతలా ఎదిగేలా చేసినవారికి నేను ఎల్లవేళలా రుణపడి వుంటానని..ఎస్పీ బాలూ ఎంతో వినమ్రంగా అంటున్నారు. అంతేకాదు, నా ముందు తరం వారు దేదీప్యమానంగా వెలిగిపోతున్న రోజుల్లో సినీరంగంలోకి వచ్చి ఎందరో ప్రముఖులతో పనిచేస్తూ నేనెన్నో నేర్చుకున్నా. నాలుగు తరాలకు వంతెనగా కొనసాగుతూ నేటికీ పాడటం సంతోషకరం.. అని ఆయన అన్నారు.

ఏదేమైనా, ప్రపంచమంతా చుట్టి తెలుగు భాషకు, పాటకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ఎస్పీ బాలూకి ఈ మహోన్నతమైన అవార్డు లభించడంతో పాటల ప్రపంచంలోని వారే కాక, సామాన్య ప్రజలు సైతం ఎంతో హర్షం ప్రకటిస్తున్నారు. బాలూ పాటకు సెంటినరీ అవార్డు లభిస్తుండడం సింహపురిసీమకే కాదు, తెలుగుజాతికే గర్వకారణం. ఈ శుభ సందర్భంలో బాలూకు 'లాయర్' మనసారా శుభాకాంక్షలు. అభివందన..అభినందన శుభచందనాలు.

# చారుగుడెమ్మదిబ్బలో వెయ్యేళ్ళనాటి చారిత్రిక ఆధారాలు

సింహపురిసీమ ఎంతో ప్రాచీనమైనది. పురాతన కాలంనాటి ఎన్నో చారిత్రిక ఆధారాలు నేటికీ జిల్లాలో అక్కడక్కడా లభిస్తూనే వున్నాయి. కోట మండలంలోని కొక్కుపాడు గ్రామంలో వున్న చారుగుడెమ్మ దిబ్బలో పురావస్తుశాఖ వారు జరుపుతున్న పరిశోధనల్లో సోమవారం వెయ్యేళ్ళ నాటి చారిత్రిక ఆధారాలు లభ్యమయ్యాయి. ఇవి ప్రాచీనకాలం నాటి తాంత్రిక ఆరాధనకు సంబంధించినవై వుంటాయని, జిల్లా ప్రాచీన చరిత్రకు సంబంధించి ఈ ఆధారాలు కూడా ఎంతో ముఖ్యమైనవని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో కాల్చిన మట్టితో చేసిన అరుదైన బొమ్మలు కూడా లభించాయి. కార్బన్ డేటింగ్ ద్వారా ఇవి ఏ కాలంనాటివో గుర్తించవచ్చని, ఈ దిబ్బపై లభించిన నల్లరాతి స్త్రీ విగ్రహం వెయ్యేళ్ళక్రితం నాటిదై వుండవచ్చని పురావస్తు పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ఈ విగ్రహాన్ని ఆనాటి పూర్వీకులు అప్పట్లో ఇక్కడున్న శివాలయంలో ప్రతిష్టించివుండవచ్చని భావిస్తున్నారు. ఇక్కడున్న చారుగుడెమ్మ గుడిలో 11వ శతాబ్దం నాటి వీరశైవుల 'ఆత్మారాధన' సంప్రదాయానికి సంబంధించిన ప్రతిమలను కూడా గుర్తించినట్లు చెప్తున్నారు. మండలకేంద్రమైన కోట పరిసరాల్లో చరిత్ర పూర్వయుగం నుంచి మానవ సంచారం వున్నదనేందుకు ఇక్కడ ఆధారాలు లభించినట్లు పురావస్తుశాఖ అధికారి జాన్ కమలాకర్, రీసెర్చ్‌స్కాలర్ రవీంద్రరెడ్డి పేర్కొంటున్నారు. అదేవిధంగా, చిల్లకూరు మండలం వద్ద కూడా అత్యంత పురాతన చారిత్రిక ఆధారాలున్నాయన్నారు.



**కొక్కుపాడులో లభించిన ప్రాచీన మట్టి విగ్రహం, పక్కన ఆత్మార్పణ చేసుకున్న వీరశైవుని ప్రతిమ**

## కాలధర్మం

### బసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి



ప్రముఖ సాహితీవేత్త, ఒకప్పటి యూత్ కాంగ్రెస్ పత్రిక ఉపసంపాదకులు బసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ నెల 2వ తేదీన అనారోగ్యంతో కనుమూసారు. ఆయన వయసు 78సంవత్సరాలు. టిపి గూడూరు మండలం, కొత్తకోడూరు ఆయన స్వగ్రామం. ఎమ్మెస్సీ(స్టాటిస్టిక్స్) పూర్తి చేసిన ఆయన సుధీర్ఘకాలం ఉపాధ్యాయవృత్తిలో పనిచేసి ఎందరో విద్యార్థుల ఉన్నతికి బాటలు వేశారు. నెల్లూరులో వేలాదిమంది అనాథలకు ఆశ్రయం కల్పిస్తున్న వాత్సల్య అనాథాశ్రమంకు కొంతకాలం పాటు అధ్యక్షుడిగా పనిచేసి సేవలందించారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# భక్తిశ్రద్ధలతో నాగులచవితి

నాగులచవితి పండుగ సందర్భంగా గురువారం నెల్లూరు నగరంలోని ప్రముఖ దేవస్థానాల్లో పుట్టల వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో నోములు నోచుకున్నారు. కార్తీకమాసం శుక్లపక్షంలో వచ్చే నాగచతుర్థి, నాగపంచమి, నాగషష్ఠి ఈ మూడురోజులు నోములు, పూజలు చేస్తారు. నెల్లూరు మూలాపేట శ్రీ కృష్ణ ధర్మరాజుల స్వామి దేవస్థానంలోని నాగులపుట్ట, పాతపెద్దాసుపత్రి సమీపంలోని పొర్లుకట్ట ప్రాంతంలోని నాగళ్ల పరమేశ్వరి అమ్మవారు, నిప్పోసెంటర్‌లోని నాగేంద్రస్వామి పుట్ట, డైకస్‌రోడ్డు సెంటర్ వద్దనున్న నాగులపుట్ట, రాయాజివీధిలో నాగులపుట్ట తదితర ప్రాంతాల్లో పుట్టల వద్ద అధిక సంఖ్యలో మహిళాభక్తులు పాల్గొని నాగులచవితిని ఘనంగా నిర్వహించారు.

# తెలుగుజాతిని విస్మరించడం సిఎంకి తగదు

## - డిప్యూటి మేయర్ ముక్కాల

తెలుగుజాతి గౌరవాన్ని కాపాడడం కోసం ఏర్పడిన తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ తెలుగుజాతిని విస్మరించడం ముఖ్యమంత్రికి తగదని అర్బన్ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు, నగర డిప్యూటిమేయర్ ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ వద్దగల పొట్టి శ్రీరాములు విగ్రహానికి అర్బన్ ఆర్యవైశ్య సంఘం తరపున నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషాప్రాతిపదికన ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అధికారపూర్వకంగా నిర్వహించకపోవడం తెలుగుజాతిని విస్మరించడమేనన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పబ్బిశెట్టి శ్రీనివాసులు, వీరబ్రహ్మం, నున్నా రమేష్, భానుప్రకాష్, అయితా భాస్కర్, వివేక్, ప్రకాష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోండి

## - హోంగార్డులకు ఎస్పీ సూచన

ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వుండకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటూ వుండాలని ఏఎస్పీ బి.శరత్‌బాబు హోంగార్డులకు సూచించారు. పోలీసు సిబ్బంది, హెూంగార్డులు విధి నిర్వహణలో అనేక ఒత్తిళ్ళను ఎదుర్కోవడంతో పాటు, వేళకు ఆహారం తీసుకోకపోవడం, నిద్రలేమి తదితర కారణాల వల్ల తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని, అందువల్ల ఆరోగ్యం పట్ల అందరూ తగు శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. మంగళవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్‌లో హోంగార్డులకు ఆరోగ్యపరిరక్షణ పట్ల అవగాహన కల్పిస్తూ, ఆరోగ్యానికై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమయానికి మంచి పోషకాహారం తీసుకోవడం, శారీరక శ్రమతో పాటు విశ్రాంతి, క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవడం ద్వారా అందరూ ఆరోగ్యంగా వుండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ శ్రీనివాసరాజు గుండెజబ్బుల పట్ల ఎలా అప్రమత్తంగా వుండాలో అందరికీ వివరించారు. వేళకు భోజనం చేయకపోవడం వల్ల వచ్చే జీర్ణకోశ వ్యాధులను గురించి డాక్టర్ వంశీకృష్ణ వివరించారు. అనంతరం, దురలవాట్లకు, మద్యపానానికి దూరంగా వుంటామని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తామని ఏఎస్పీ హోంగార్డులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దంతవైద్యుడు శ్రీనివాసరెడ్డి, హోంగార్డ్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ చిరంజీవి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, హోంగార్డుల సంక్షేమసంఘం అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తి న్యూస్

# విద్యార్థులకు దీపావళి వెలుగులు



**బి.సి హాస్టల్లో విద్యార్థులతో దీపావళి పండుగను జరుపుకుంటున్న కౌన్సిలర్ సుప్రజ**

శ్రీకాళహస్తి పట్టణంలోని బిసి హాస్టల్ విద్యార్థులకు రాష్ట్ర అటవీ శాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ విద్యార్థులలో "దీపోత్సవం" వెలుగులు నింపారు.బిసి హాస్టల్‌లో నిరుపేద విద్యార్థులు విద్యార్థినుల హృదయాల్లో మేము దీపావళి పండుగ చేసుకోలేదు అనే ఉద్దేశ్యం రాకుండా వాళ్ళు దీపావళి పండుగను " దీపోత్సవం" లాగా చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఆమె 9వ వార్డు కౌన్సిలర్ సుప్రజ ద్వారా టపాసులు పంపారు. మంత్రి సతీమణి నిరుపేద విద్యార్థుల బాధలను అర్థం చేసు కున్నారన్నారు. వారి సమస్యల్ని తెలుసుకొని పరిష్కరిస్తూ హాస్టల్స్‌లో విద్యార్థులకు దీపావళి సందర్భంగా మతాబులు పంపడం పట్ల పలువురు హర్షించారు.




# భక్తి - శక్తి గీతాల పోటీలు

దీపావళి పర్వదినం సందర్భంగా నెల్లూరు టౌన్‌హాలు సమావేశ మందిరంలో ఆదివారం సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో భక్తి-శక్తి గీతాల పోటీలను నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి ఔత్సాహిక గాయనీగాయకులు పాల్గొని తమ స్ఫూర్తిని చాటారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, డాక్టర్ మారం సుధాకర్, ఆచార్య ఆదిత్య, డాక్టర్ భీమినేని రత్నకుమారి, ఆనందరావు, అందె శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా పాల్గొని బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

విజేతలు - సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో టిఎన్‌సి విజయకుమార్, కె.బాబు, పి.వి.శ్రీధర్‌లు గెలుపొందగా, సూపర్ సీనియర్స్ విభాగంలో వరుసగా ఎస్.కె.మహబూబ్ షరీఫ్, టిఎన్‌సి రాము, జి.సుబ్రహ్మణ్యంలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. జూనియర్స్ విభాగంలో ఐవిఎన్ఎస్ జ్ఞానశ్రీ, పి.రెడ్డి రుష్మిత, టి.షన్విత‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. పలువురికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

# దళిత గిరిజనుల హాస్టల్స్‌ను పునఃప్రారంభించాలి

ఆంధ్రరాష్ట్రంలో 1971 నుంచి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లను ప్రారంభించడం జరిగిందని, ఇటీవలకాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రికి సంబంధిత అధికారులు విషయాన్ని ప్రక్కదారి పట్టించి దళిత గిరిజన హాస్టళ్లను మూసివేతకు గురిచేయడం దారుణమని ఏపి దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శి అరవ పూర్ణప్రకాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం పునఃపరిశీలించి హాస్టళ్లను ప్రారంభించాలని కోరారు.

# అవతరించిందా? అంతరించిందా??

(మొదటి పేజీ తరువాయి)

విభజన జరిగింది. ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ విడిపోయింది. జూన్ 2వ తేదీని తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంగా ఆ రాష్ట్రం జరుపుకుంటోంది. మన దురదృష్టం ఏంటంటే అదే జూన్ 2వ తేదీని ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా జరుపుకోవడం. రాష్ట్రంలోని అన్ని రాజకీయపక్షాలు, మేధావులు, తెలుగు సాంస్కృతిక వాదులు వ్యతిరేకిస్తున్నా కూడా చంద్రబాబు జూన్ 2వ తేదీనే ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా ఖరారు చేశారు. అసలు ఆంధ్రప్రదేశ్ కొత్తగా అవతరించిందేముంది. 1951లో ఇది భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడింది. ఈ రాష్ట్రంలోకి మధ్యలో తెలంగాణ వచ్చి కలిసింది. తిరిగి 2014లో విడిపోయింది. కాబట్టి కొత్త రాష్ట్ర అవతరణ దినం ఏదన్నా ఉందంటే అది తెలంగాణకే! ఏపిని కొత్తగా ఏర్పాటు చేసిందేమీ లేదు. కాని చంద్రబాబు తానేదో కొత్తగా రాష్ట్రాన్ని సాధించినట్లు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జూన్ 2వతేదీకి మార్చారు. రాష్ట్రావతరణ దినోత్సవ వేడుకలనేవి సంతోషంతో జరుపుకోవాల్సినవి. తెలంగాణ విభజన సమయంలో ఏపి ప్రజలు ఎంతో క్షోభపడ్డారు. అన్యాయమైన విభజనకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించారు. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. విభజనతో ఆర్థికంగానూ రాష్ట్రం ఎంతో కోల్పోయింది. అలాంటి తేదీని మనం రాష్ట్రావతరణ వేడుకగా జరుపుకోవడమా? చంద్రబాబు పైశాచికానందం తప్పితే ఇందులో ఏమన్నా అర్థముందా? అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగా సిద్ధించిన భాషాప్రయుక్త రాష్ట్రమే మనకు ఒరిజినల్! నవంబర్ 1వ తేదీ ఆంధ్రజాతికి పండుగరోజు. అలాంటి పండుగరోజును చరిత్ర పుటల నుండే మాయం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కింది.

# అంతా మా ఇష్టం

(5వ పేజీ తరువాయి)

లోపలకు రానీయకుండా నిర్వహించడం సిగ్గుచేటు చర్య. అసలు ముందుగానే పోలీసు బందోబస్తు కోరడం చూస్తుంటే మేయర్ గారి పాలనా నిర్వాకం ఏ స్థాయిలో వుందో అర్థమవుతుంది. ఈ సమావేశాన్ని పెట్టింది కూడా ప్రజాసమస్యలను చర్చించడానికి కాదు. పాలకవర్గంలో కొందరికి అవసరమైన సొంత ప్రయోజనాల పనులను ఆమోదింప జేసుకోవడానికి! మొత్తం 44అంశాలతో అజెండా రూపొందించగా వాటిలో 43అంశాలను ఆమోదించారు. వీటిలో వివాదాస్పదమైన లక్ష్మీపురం స్థలం కూడా ఉండడం విశేషం. వైసిపి, సిపిఎం కార్పొరేటర్లతో పాటు తెలుగుదేశం కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి ఈ అంశాన్ని బలంగా వ్యతిరేకించినా, మిగతా అధికార పార్టీ కార్పొరేటర్లు ఏకమై ఈ అంశాలను ఏకపక్షంగా ఆమోదించేసారు.

ఇక సమావేశం ఆరంభంలోనే అరుపులు, గొడవలు, తోపులాటలు కామన్‌గా జరిగాయి. దేవరకొండ అశోక్, ప్రశాంతి కిరణ్ అనే కార్పొరేటర్లు బాహాబాహీ తలపడ్డారు. కౌన్సిల్‌లో తెలుగుదేశం కార్పొరేటర్లు ఎక్కువమంది అజీజ్‌కు వ్యతిరేకంగా వున్నారు. కౌన్సిల్ సమావేశంలో వీళ్లు కూడా అజీజ్‌ను ఉతికి ఆరేసేవాళ్లే! అయితే ముందుగానే పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర రంగంలోకి దిగి వీరిమధ్య రాజీ కుదిర్చి, మేయర్ అక్రమ అజెండాకు ఆమోదం లభించేలా చేశారు.

# ఆలయాలకు 'కార్తీక' శోభ

ఎంతో పవిత్రమైన కార్తీకమాసం ప్రారంభం కావడంతో సోమవారం నుంచి జిల్లాలోని శివకేశవాలయాలు కార్తీక దీప కాంతులతో కళకళలాడుతున్నాయి. ఆలయాలను విద్యుత్‌దీప కాంతులతో శోభాయమానం చేసి ఆలయ నిర్వాహకులు వైభవాతి వైభవంగా కార్తీకమాస ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. పరమ పవిత్రం..పుణ్యప్రదమైన ఈ మాసంలో నదీనదాల్లో స్నానాలు ఆచరించి భక్తులు ఆలయాలకు విచ్చేసి భగవద్దర్శనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా శివాలయాల్లో కార్తీకదీపోత్సవాలు మరింత సందడిగా జరుగుతున్నాయి. ఆలయాల్లో కొలువైవున్న పరమేశ్వరునికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో కుటుంబాలతో సహా విచ్చేసి ఈ వేడుకల్లో పాల్గొని స్వామివార్లను దర్శించుకుంటున్నారు.



మూలస్థానేశ్వరాలయంలో ఆకాశదీపం వెలిగిస్తున్న ఎమ్మెల్యే అనిల్

## మూలస్థానేశ్వరునికి 'కార్తీక' కాంతులు:

నెల్లూరు నగరంలోని శివాలయాలు కార్తీకశోభలతో అలరారుతున్నాయి. మూలాపేటలో వున్న భువనేశ్వరీ సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయానికి నగర ఎమ్మెల్యే డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్ వచ్చి స్వామివారిని దర్శించుకుని ఆలయంలో ఆకాశ దీపం వెలిగించారు. సోమవారం ఉదయం ప్రముఖ పారిశ్రామిక వేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులు విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం మూలస్థానేశ్వరునికి పూజలు చేశారు. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, వైఎస్సార్సీపి నాయకుడు పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు కూడా కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా ఆలయానికి విచ్చేసి మూలస్థానేశ్వరుని దర్శించుకున్నారు. సాయంత్రం మాజీమంత్రి, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, కార్పొరేటర్లు జడ్.శివప్రసాద్, ఆనం రంగమయూర్‌రెడ్డి తదితరులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కార్తీకమాసం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి కేదారేశ్వరవ్రతం, పేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఛైర్మన్ మెట్టు సురేష్‌బాబు-సుభాషిణి దంపతులు ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని, కార్తీక దీపాలు వెలిగించారు. 'ఓం నమ:శివాయ', హరహర మహాదేవ..అంటూ భక్తులు చేసిన శివనామస్మరణలతో ఆలయం మార్మోగింది.

## శ్రీ మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయంలో:

దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కొలువై వున్న శ్రీ మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు తంగిరాల రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. సోమవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో ఆకాశదీపాలు వెలిగించారు. ఆలయ ఇ.ఓ కోదండ రామిరెడ్డి, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్ నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అదేవిధంగా, ఉస్మాన్ సాహెబ్‌పేటలోని శ్రీ అన్నపూర్ణ కాశీవిశాలాక్షి సమేత శ్రీ కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు వందవాసి గురుకుల్ ఆధ్వర్యంలో కార్తీకమాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ కె. వెంకటరమేష్‌కుమార్, ఆలయ ఇ.ఓ వి.మధుసూదన్‌రావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. నవాబుపేటలోని శ్రీ భ్రమరాంబాసమేత మల్లేశ్వర స్వామి ఆలయంలోనూ కార్తీక మాసోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో కొలువైవున్న శ్రీ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ ముత్తినేని బాలకిషోర్‌నాయుడు, ఆలయ ఇ.ఓ ఎస్.నవీన్ కుమార్‌తో పాటు, పాలకమండలి సభ్యులు ఈ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. బిజెపి జిల్లాశాఖ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.

# నిజాయితీపరుడు

రోడ్డు మీద రోల్డ్‌గోల్డ్ వస్తువు దొరికినా నొక్కేసే ఈ రోజుల్లో బంగారుగాజు దొరికితే నిజాయితీగా గాజు పోగొట్టుకున్న బాధితునికి అప్పగించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే నెల్లూరు నగరానికి చెందిన వై.నరేష్‌కు ఫతేఖాన్‌పేట బ్రాంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా వుంది. గత నెల 31వతేదీన నరేష్ ఎస్‌బిఐ బయటవున్న ఎటిఎంలో నగదు డ్రా చేసుకుని బైకుపై వెళ్లే క్రమంలో అతని జేబులో వున్న 10గ్రాముల బంగారుగాజు కిందపడిపోయింది. ఈ విషయాన్ని అతను గమనించకుండా ఇంటికెళ్లి చూసుకుంటే కనిపించలేదు. దీంతో బాధితుడు బ్యాంకు వద్దకు వచ్చి గాలించి విషయాన్ని బ్యాంకు అధికారులకు తెలియజేసి నిరాశగా ఇంటికెళ్లాడు. బ్యాంకు మెసెంజర్ చిట్టిబాబు తన పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు బ్యాంకు బయటకు రాగా అక్కడ అతనికి బంగారు గాజు కనిపించింది. ఈ విషయాన్ని బ్యాంకు అధికారులకు తెలియజేసి బాధితుడు నరేష్‌కు గాజును అప్పగించారు. చిట్టిబాబు నిజాయితీని బ్యాంకు చీఫ్‌మేనేజర్ రామకృష్ణ, డిప్యూటీ మేనేజర్ ప్రభుదాస్ కొనియాడారు.

# ఎవరికి 'ఉప'యోగం

(మొదటి పేజీ తరువాయి)

గెలిచిన స్థానాలన్నీ కూడా రెడ్ల ప్రాబల్యం వున్న నెల్లూరు, కడప, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లోనివే! ఓడిన రెండు స్థానాలు కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లోనివి. ఈ రెండు జిల్లాల్లో కాపుల ప్రాబల్యం ఎక్కువ. ఈ రెండు సీట్లు ఓడిపోయినప్పుడే జగన్ జాగ్రత్తగా అక్కడి కాపులను పట్టుకొచ్చి వుండాలి. కాని ఆ ఉపఎన్నికల్లో వచ్చిన భారీ మెజార్టీలు 2014 ఎన్నికల్లో జగన్‌ను పరోక్షంగా దెబ్బతీసాయి. అతనిలో నిర్లక్ష్యం పెరగడానికి ఆ ఎన్నికలే కారణమయ్యాయి. జగన్ మళ్లీ ఇప్పుడు అదే పంథాలోకి పోతున్నాడు. ప్రత్యేకహోదా ఉద్యమంలో భాగంగా తన పార్టీ ఎంపీల చేత రాజీనామా చేయించి ఉపఎన్నికలకు పోతానంటున్నాడు. ఇది సాధ్యమయ్యే పనేనా? అసలు దీనివల్ల ఎవరికి ఉపయోగం! అసలు వైకాపా ఎంపీలు రాజీనామాలకు సిద్ధంగా ఉన్నారా? ఒక లోక్‌సభ ఎంపీకి అవుతున్న ఖర్చు 50 నుండి వంద కోట్ల దాకా వుంటుంది. ఐదేళ్లకో సారి ఎంపీ ఎలక్షన్ చేయడానికే వాళ్లకు వాచిపోతుంది. అలాంటిది ఐదేళ్లకు రెండు సార్లు పోటీ చేయాలంటే మాటలా? అదీ గాక అభ్యర్థుల ఖర్చు పార్టీ భరించే పరిస్థితి వుందా? అభ్యర్థులనే ఖర్చంతా పెట్టుకో మంటే పెట్టుకుంటారా? ఇది సాధ్యమయ్యే పనే కాదు. రాజీనామా చేసేది లేదని ఒక ఎంపీ అడ్డం తిరిగినా పార్టీ పరువు పోతుంది. ఒకవేళ జగన్ మాటకు కట్టుబడి ఎంపీలు రాజీనామా చేసారే అనుకుందాం. ఉపఎన్నికలు జరిగినంత మాత్రాన ఎవరికి లాభం? ఎవరికి నష్టం? ఒక వేళ 8ఎంపీ సీట్లలో తిరిగి వైకాపా అభ్యర్థులే గెలిచినా తెలుగుదేశంకు పోయేదేమీ లేదు. ఒకవేళ వైకాపా ఒక ఎంపీ సీటులో ఓడిపోయినా అది ప్రజావ్యతిరేకత ఎదుర్కొంటున్న తెలుగుదేశంకు ప్రాణప్రతిష్టే అవుతుంది. ఒకవేళ భారీ మెజార్టీలతో వైకాపా అభ్యర్థులే గెలిచారనుకుందాం... దానివల్ల చంద్రబాబు తనపై వ్యతిరేకతను తగ్గించుకునే ప్రయత్నాలు మొదలుపెట్టొచ్చు. ఈ ఉపఎన్నికల వల్ల ఏ విధంగా చూసినా జగన్‌కు నష్టం, చంద్రబాబుకు లాభం. ప్రత్యేకహోదా పేరుతో ఉపఎన్నికల్లో పోటీ చేసి వైకాపా అభ్యర్థులు భారీ మెజార్టీలతో గెలిచినా కేంద్రం ఇప్పటికిప్పుడు రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇచ్చేదేమీ లేదు. ఇప్పుడు అర్థాంతరంగా ఉపఎన్నికలంటే ప్రజల్లోనూ అంత ఆసక్తి లేదు. అదీగాక ఏపి ప్రజల్లో ఎటువంటి భావోద్వేగాలు లేవు. కాబట్టి ప్రత్యేక హోదా సాధన కోసం జగన్ రాజీనామాలను కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించాలి.

## విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# పేదలకు వస్త్ర, అన్నదానం



ప్రముఖ వ్యాపారవేత్త, దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తల్లిగారైన స్వర్గీయ వేమిరెడ్డి శ్యామలమ్మ 3వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 1న నెల్లూరులోని ప్రధాన దేవస్థానాల వద్ద, దర్గాల వద్ద పేదలకు వస్త్రదానం, అన్నదానం కార్యక్రమాలు విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వాత్సల్య అనాధాశ్రమం, ప్రగతి ఛారిటీస్, గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విపిఆర్ ఫౌండేషన్ సారధులు మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేదలకు సహాయం



చేయాలని, కష్టాల్లో వున్న ప్రతి ఒక్కరిని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో గత 20ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారని, వారి తల్లి స్ఫూర్తితో విపిఆర్ ఫౌండేషన్‌ను స్థాపించి ఉచిత విద్య, ఉచిత వైద్యం కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.







## నాయకులకు పరీక్షగా
# జనచైతన్య యాత్రలు



వైపాకా వాళ్లు 'గడప గడపకు వైకాపా' కార్యక్రమం నిర్వహిస్తుండగా, అధికార తెలుగుదేశంపార్టీ కూడా పోటీగా 'జనచైతన్యయాత్ర'లకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 10అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జనచైతన్యయాత్రలు మొదలయ్యాయి. కోవూరు, వెంకటగిరిలలో ఎమ్మెల్యేలు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ యాత్రలు జరుగుతున్నాయి. వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ తొలిరోజే కింద పడి చేతికి గాయం కావడంతో యాత్రలు ముగిసేదాకా ఇక ఆయన పాల్గొనలేకపోవచ్చు. తన నియోజకవర్గ పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్నాడని తెలిసినా, ఆ వైపుకు రాకుండా మహారాష్ట్రలో తన కాంట్రాక్ట్ పనులు చూసుకునే ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు యధావిధిగా జనచైతన్య యాత్రల ప్రారంభానికి రాలేదు. ద్వితీయశ్రేణి నాయకులే ఇక్కడ జనచైతన్య యాత్రలు చేస్తున్నారు. ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి, సర్వేపల్లిలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎంతో హుషారుగా యాత్రలు జరుగుతున్నాయి. కావలి, గూడూరు, సూళ్లూరుపేట, నెల్లూరు నగరం, నెల్లూరురూరల్ నియోజకవర్గాలలో కూడా ఇన్‌ఛార్జ్‌ల ఆధ్వర్యంలో జనచైతన్యయాత్రలు మొదలయ్యాయి. ఈ యాత్రలు మండలస్థాయి నేతలకు అగ్నిపరీక్షగా మారాయి. యాత్రలకు జనాన్ని తీసుకొచ్చే బాధ్యత వారిదే కావడంతో ఎక్కడికక్కడ జనాలను తరలించడానికి వాళ్లు నానా తంటాలు పడుతున్నారు.

# 86వ జయంతి



జననం: 08-11-1930 మరణం: 18-01-1995

## కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు

వ్యవస్థాపకులు

లాయర్
తెలుగు వారపత్రిక

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com